www.velthuru.com    RNI TEL TEL/ 2019 / 78609    శుక్రవారం

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 15, మార్చి 2024

సంపుటి: 5  సంచిక: 295,  పేజీలు: 12,  వెల: రూ.5/-






# టెట్ నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- మే 20 నుండి టెట్ పరీక్షలు
- టెట్ నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్,మార్చి14(వెలుతురు):** తెలంగాణలో 3 లక్షల మంది అభ్యర్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డీఎస్సీ కంటే ముందే టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ కు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో.. త్వరలో టెట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. వీలైనంత ఎక్కువ మంది డీఎస్సీ రాసే అవకాశం కల్పించాలని సర్కార్ చూస్తోంది. ఇదిలా ఉంటే.. తెలంగాణలో మెగా డీఎస్సీ (TS DSC 2024) దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా.. మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. మరోవైపు.. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం ఉద్యోగాల్లో 2,629 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉండగా.. 727 భాషా పండితులు, 182 పీఈటీలు, 6,508 ఎస్జీటీలుబీ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 220 స్కూల్ అసిస్టెంట్, 796 ఎస్జీటీ పోస్టులు ఉన్నాయి. కాగా.. తెలంణలో హైదరాబాద్‌లో 878 అత్యధిక ఖాళీలు ఉండగా.. నల్గొండ జిల్లాలో 605, నిజామాబాద్‌లో 601, ఖమ్మం 757, సంగారెడ్డి 551, కామారెడ్డి 506 చొప్పున ఖాళీలు ఉన్నాయి. అయితే వాటిని భర్తీ చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. టెట్ నిర్వహణకు తెలంగాణ సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. డీఎస్సీ కంటే ముందే నిర్వహించుకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జీవో ఇచ్చిందని పేర్కొన్నారు. దీంతో 3 లక్షల మంది నిరుద్యోగులకు మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం నిరుద్యోగులపక్షాన ఉంటుంది అనడానికి ఇదే నిదర్శనం అని అన్నారు. ప్రజల, నిరుద్యోగుల ఆలోచనలను కాంగ్రెస్ ప్రభుత్వం వింటుంది అని మరోసారి రుజువైంది.. వివరాలు 2లో...




# ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్..!

- కసరత్తు చేస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ,మార్చి14(వెలుతురు):** లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు సమయం ఆసన్నమైంది. భారత ఎన్నికల సంఘం ఒకటి రెండు రోజుల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నోటిఫికేషన్ వివరాలు ప్రకటించే అవకాశం ఉందంటూ జాతీయ మీడియా వివరాలు 2లో...



# రాష్ట్రపతి ముర్ముకు చేరిన జమిలి వివరాలు

- 18,629 పేజీల నివేదిక
- 190 రోజుల పాటు వివిధ వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ
- రాష్ట్రపతిని కలిసి నివేదిక అందించిన రామ్‌నాథ్ కోవింద్

**న్యూఢిల్లీ,మార్చి14(వెలుతురు):** ఒకే దేశం.. ఒకే ఎన్నికకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. వివరాలు 2లో...

## ఢిల్లీ మెట్రో ఫేజ్ 4కు

# శంకుస్థాపన చేసిన ప్రధాని

**న్యూఢిల్లీ,మార్చి14(వెలుతురు):** ఢిల్లీ మెట్రో ఫేజ్ 4కు గురువారం ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియానికి చేరుకున్న ఆయన మెట్రో పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రధానమంత్రి స్వనిధి పథకం లబ్ధిదారులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఢిల్లీకి చెందిన 5 వేల మంది ఎస్వీలతో సహా లక్ష మంది వీధి వ్యాపారులకు (ఎస్‌వీ) పథకం కింద రుణాలు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ మెట్రో 4వ దశకు సంబంధించిన రెండు అదనపు కారిడార్లకు ప్రధాని శంకుస్థాపన చేశారు. కొత్త కారిడార్లు ఇందర్‌లోక్ నుంచి ఇంద్రప్రస్థ వరకు.. లజపత్ నగర్ నుంచి సాకేత్ జి బ్లాక్‌కు అనుసంధానం చేయబడతాయి. దాదాపు 20 కిలోమీటర్ల మేర ఈ మెట్రో నిర్మాణం జరగనుంది. దీని ద్వారా కనెక్టివిటీ సుగమం అయితే ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ప్రధాని మోడీ దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. అలాగే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రజలకు తాయిలాలు కూడా ప్రకటించారు. ఇటీవల మహిళల కోసం వంట గ్యాస్ రూ.100 తగ్గించారు. అలాగే సీఏఏ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే వివరాలు 2లో...



## తెలంగాణకు ప్రధాని

# మోదీ రాక

- నేడు మల్కాజిగిరిలో రోడ్ షో..
- మల్కాజిగిరి నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

**హైదరాబాద్,మార్చి14(వెలుతురు):** హైదరాబాద్ వేదికగా ప్రధాని నరేంద్రమోదీ లోక్ సభ ఎన్నికలకు శంఖారావాన్ని వివరాలు 2లో...

# ఏడాదికి 3500 ఇళ్ల నిర్మాణం చేస్తాం

## ప్రతీ నియోజకవర్గంలోనూ నిర్మిస్తాం

## మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హుజూర్ నగర్, మార్చి 14 (వెలుతురు):** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలోని సీతారామ స్వామి గుట్టపై పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ శంకుస్థాపన చేశారు. రూ.74.80 కోట్లతో 2160 సింగిల్ బెడ్రూం ప్లాట్ ల నిర్మాణానికి శంకుస్థాపన, పైలాన్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ కావాలనే ఇళ్లను



పూర్తి కాకుండా చేశారని అన్నారు. ప్రతీ నియోజక వర్గంలో ఏడాదికి 3500 ఇళ్ల వివరాలు 2లో...

## సీఏఏను వెనక్కి

# తీసుకోం....

- ఇది ఎవరికీ వ్యతిరేకం కాదన్న హోంమంత్రి
- విపక్షాల వాదనల్లో అర్థం లేదన్న అమిత్ షా
- 370 ఆర్టికల్ రద్దు సమయంలోనూ ఇలాగే చేశారి విమర్శలు

**న్యూఢిల్లీ,మార్చి14 (వెలుతురు):** సీఏఏను ఎప్పటికీ వెనక్కి తీసుకోబోమని హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం ఏ దేశ ముస్లింలైనా భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రతిపక్ష కాంగ్రెస్ సహా తృణమూల్, సీపీఐ, ఆప్, సమాజ్‌వాదీ, డీఎంకే తదితర వివరాలు 2లో...



## అన్ని రంగాల్లో

# దేశాభివృద్ధి...

- మోడీ వల్లనే ఇది సాధ్యం అయ్యింది
- బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్



**హైదరాబాద్, మార్చి14 (వెలుతురు):** దేశాన్ని అన్ని రంగాల్లో మోదీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, ప్రపంచ దేశాలన్నీ మోదీకి రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతున్నాయని బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. దేశానికి మోడీ పాలనే శరణ్యమని అన్నారు. ప్రపంచ దేశాలు కూడా మోడీ నాయకత్వంపై నమ్మకంతో ఉన్నాయని అన్నారు. వివరాలు 2లో...



## డికె శివకుమార్‌తో

# మల్లారెడ్డి భేటీ

- కొడుకుతో కలసి ప్రత్యేకంగా చర్చలు
- కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారం జోరు
- నేడు ప్రియాంకతో భేటీ అయ్యే చాన్స్

**బెంగళూరు,మార్చి14(వెలుతురు):** లోక్ సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఒక్కొరి వివరాలు 2లో...




ఈటల రాజేందర్

మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి

## ఢిల్లీ మెట్రో ఫేజ్ 4కు శంకుస్థాపన చేసిన ప్రధాని

**మొదటిపేజీ తరువాయి..**

త్వరలోనే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. గురువారం ఎన్నికల సంఘంలోకి ఇద్దరు అధికారులు కొత్తగా నియామకం జరిగింది. నోటిఫికేషన్ విడుదలకు ఎన్నికల సంఘం సిద్ధపడుతోంది. ఏ క్షణములోనైనా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

## తెలంగాణకు ప్రధాని మోదీ రాక

**మొదటిపేజీ తరువాయి..**

పూరించనున్నారు. రేపో మాపో ఎన్నికల్ షెడ్యూల్ విడుదల కానుందన్న సంకేతాల నేపథ్యంలో.. మల్కాజ్ గిరిలో శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ రోడ్ షో నిర్వహించనున్నారు. మల్కాజ్ గిరి నియోజకవర్గం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. లోక్ సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించి.. మరోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోన్న బీజేపీ.. హైదరాబాద్ లో మల్కాజ్ గిరి స్థానంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సికింద్రాబాద్ సిట్టింగ్ స్థానం సహా మల్కాజ్ గిరి, చేవెళ్ల, హైదరాబాద్ స్థానాలపై ఫోకస్ పెట్టింది కమలదళం. వరుసగా జాతీయ నేతలు తెలంగాణకు క్యూ కడుతున్నారు. రెండ్రోజుల క్రితం హోంమంత్రి అమిత్ షా నగరంలో పర్యటించగా.. 10 రోజుల వ్యవధిలోనే ప్రధాని మోదీ రెండవసారి రాష్ట్రానికి వస్తుండటం గమనార్హం. నగర శివార్లలోని పటాన్ చెరులో జరిగిన బహిరంగ సభలో మోదీ ఇటీవలే పాల్గొన్న విషయం తెలిసిందే.

లోక్ సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ.. నగర ఓటర్లను ఆకట్టుకునేందుకు రోడ్ షో లు నిర్వహిస్తోంది. శుక్రవారం మల్కాజ్ గిరిలో సుమారు 5 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించనుంది. ఈ రోడ్ షో లో ప్రధాని నరేంద్రమోదీ పదేళ్లలో జరిగిన పాలన, కేంద్రం ప్రవేశ పెట్టిన పథకాలు, సాధించిన విజయాలు, చేసిన అభివృద్ధి పనుల గురించి ప్రసంగించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ లో పోలీసులు ఆంక్షలు విధించారు. మార్చి 15న మల్కాజ్ గిరిలో జరగనున్న సభలో ప్రధాని పాల్గొననున్నారు. మీర్జాల్ గూడ నుంచి మల్కాజ్ గిరి క్రాస్ రోడ్డు వరకూ 5 కిలోమీటర్ల మేర పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్ డ్రోన్లు, రిమోట్ కంట్రోల్ మైక్రో ఎయిర్ క్రాఫ్ట్ లను ఎగురవేసేందుకు అనుమతి లేదని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఆదేశించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఐపీసీ సెక్షన్ 188, 121, 121(ఏ), 287, 336, 337, 338 కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఏడాదికి 3500 ఇళ్ల నిర్మాణం చేస్తాం

**మొదటిపేజీ తరువాయి..**

నిర్మాణం చేస్తామని తెలిపారు. రేషన్ కార్డులు లేకున్నా ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. హుజూర్ నగర్ లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఊరుకునేది లేదని మంత్రి




ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని అందరం కలిసి బయటికి తెచ్చేలా కృషి చేస్తున్నామని అన్నారు. కాళేశ్వరంలో చేసిన తప్పుడు విధానాలతో ప్రస్తుతం నీళ్లున్నా వాడుకోలేకపోతున్నామని తెలిపారు. గత పాలకుల శాపాలు ఇప్పుడు ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. భద్రాద్రి, యాదాద్రి పేరుతో దోచుకోవడానికి ప్రచారంలో బాగా వాడుకున్నారని ఆరోపించారు. ధరణిలో ఎలా ల్యాండ్ మాయ చేశారో త్వరలో ప్రజల ముందుకు తీసుకొస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

## ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్..!

**మొదటిపేజీ తరువాయి..**

కథనాలు పేర్కొంటున్నాయి. నేడో, రెపో షెడ్యూల్ ప్రకటించవచ్చని పేర్కొంటున్నాయి. ప్రకటన తేదీల్లో మార్పు ఏమైనా ఉన్నా ఈ వారంలో షెడ్యూల్ విడుదల కావడం ఖాయమంటూ రిపోర్టులు పేర్కొంటున్నాయి. కాగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కూడా వెలువడనుంది. జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికల సన్నద్ధతపై ఎన్నికల సంఘం బృందం పరిశీలన అనంతరం నోటిఫికేషన్ వెలువడాల్సి ఉందని, అయితే ఎన్నికల సంఘం బుధవారం జమ్మూకాశ్మీర్‌లో పర్యటించడంతో ఇక నోటిఫికేషన్ వెలువడడమే తరువాయి అని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. కాగా సెప్టెంబర్ 30, 2024లోగా జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి, రాష్ట్ర హోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు గతేడాది కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం బృందం బుధవారం అక్కడ పర్యటించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. భద్రతా పరిస్థితిని సమీక్షించిన అనంతరం జమ్మూ కాశ్మీర్‌లో లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలా? లేక వేర్వేరుగా నిర్వహించాలా? అనే దానిపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

## రాష్ట్రపతి ముర్ముకు చేరిన జమిలి వివరాలు

**మొదటిపేజీ తరువాయి..**

భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోనే హైలెవల్ కమిటీ తన నివేదికను గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేశారు. ఈ నివేదికలో దేశంలో జమిలి ఎన్నికలు సాధ్యమేనని కమిటీ స్పష్టం చేసింది. 2029 దేశ వ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించొచ్చని పేర్కొంది. ఈ ప్రతిపాదనకు పార్లమెంట్ ఆమోదం తెలిపితే.. 2029లో దేశ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలతో పాటే.. అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే, ఈ ఎన్నికల నిర్వహణ అంత ఆశామాషీ ఏం కాదని నిపుణులు చెబుతున్నారు. భారీ వ్యయంతో పాటు.. పెద్ద సంఖ్యలో అధికార గణం అవసం అవుతుందని అంచనా వేస్తున్నారు. అంతకంటే ముందు.. జమిలి ఎన్నికలను అమలు చేయాలంటే రాజ్యాంగంలో పలు సవరణలు చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ ఓకే అయితే.. అసలైన సవాల్ మరోటి ఉంది. అదేంటంటే..

### అందరిలో మెదిలే ప్రశ్న..

ఇవాళో రేపో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానుంది. ఏప్రిల్ చివరలో గానీ, మే మొదటి వారంలో గానీ ఎన్నికలు జరగనున్నాయి. లోక్‌సభ ఎన్నికలతో పాటే.. 5 రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరగనున్నాయి. అంటే మళ్లీ ఐదేళ్ల తరువాత 2029లో లోక్‌సభ ఎన్నికలతో పాటు ఈ 5 రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ మధ్యకాలంలో దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఒకవేళ జమిలి ఎన్నికలకు పార్ల మెంట్




ఆమోదం తెలిపితే.. అప్పుడు అన్ని రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు ఎలా నిర్వహిస్తారనే సందేహం సహజంగానే అందరిలోనూ ఉంటుంది.

### అయితే పొడగింపు.. లేదంటే రద్దు..

జమిలి ఎన్నికలు అమల్లోకి వస్తే.. జూన్ 2024 – మే 2029 మధ్య ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం 18వ లోక్‌సభతో ముగుస్తుంది. అంటే ఈ వన్-టైమ్ ఎన్నికల కసరత్తులో కొన్ని అసెంబ్లీల పదవీకాలం ఐదేళ్ల లోపే ఉంటుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ వంటి రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం జూన్ 2024, మే 2029 మధ్య ముగుస్తుంది. అంటే కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి ఎక్కువ సమయం దొరకదు. ఉదాహరణకు తెలంగాణలో రేవంత్ సర్కార్ డిసెంబర్ 2023లో ఏర్పాటైంది. అంటే 2028 నవంబర్‌లో ఎన్నికలు నిర్వహించి.. డిసెంబర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. కానీ, జమిలి ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ గడువును పొడగించడం జరుగుతుంది. ఒకవేళ ప్రభుత్వం గడువు మే 2029 దాటి ఉన్నట్లయితే.. ఆ ప్రభుత్వాన్ని రద్దు చేసి మళ్లీ ఎన్నికలకు పోవాల్సి ఉంటుందన్నమాట.

# టెట్ నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి..**

నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వానికి తన కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్ విడుదల అయింది. ఈ నెల 27 నుండి వచ్చే నెల 10 వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరించనున్నారు. మే 20 నుండి జూన్ 3 వరకు టెట్ పరీక్షలు జరుగనున్నాయి. కొద్దిసేపటి క్రితమే.. టెట్ నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. తాజాగా నోటిఫికేషన్ రిలీజైంది. డీఎస్సీ కంటే ముందే టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇదిలా ఉంటే.. తెలంగాణలో మెగా డీఎస్సీ (TS DSC 2024) దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా.. మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. మరోవైపు.. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం ఉద్యోగాల్లో 2,629 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉండగా.. 727 భాషా పండితులు, 182 పీఈటీలు, 6,508 ఎస్జీటీలుబీ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 220 స్కూల్ అసిస్టెంట్, 796 ఎస్జీటీ పోస్టులు ఉన్నాయి. కాగా.. తెలంణలో హైదరాబాద్‌లో 878 అత్యధిక ఖాళీలు ఉండగా.. నల్గొండ జిల్లాలో 605, నిజామాబాద్‌లో 601, ఖమ్మం 757, సంగారెడ్డి 551, కామారెడ్డి 506 చొప్పున ఖాళీలు ఉన్నాయి. అయితే వాటిని భర్తీ చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. టెట్ నిర్వహణకు తెలంగాణ సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. డీఎస్సీ కంటే ముందే నిర్వహించుకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జీవో ఇచ్చిందని పేర్కొన్నారు. దీంతో 3 లక్షల మంది నిరుద్యోగులకు మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం నిరుద్యోగులపక్షాన ఉంటుంది అనడానికి ఇదే నిదర్శనం అని అన్నారు. ప్రజల, నిరుద్యోగుల ఆలోచనలను కాంగ్రెస్ ప్రభుత్వం వింటుంది అని మరోసారి రుజువైంది.. నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వానికి తన కృతజ్ఞతలు తెలియజేశారు.

# సీఏఏను వెనక్కి తీసుకోం....

మొదటిపేజీ తరువాయి..

పార్టీలు ఈ చట్టాన్ని ఇప్పటికే వ్యతిరేకించాయి. తమ రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని అమలు చేయబోమని స్పష్టం చేస్తున్నాయి. ఈ చట్టాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్లు కూడా వెల్లువెత్తున్నాయి. పలువురు ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో సీఏఏ అంశంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. సీఏఏను ఎప్పటికీ వెనక్కి తీసుకోబోమని హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం ఏ దేశ ముస్లింలైనా భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఇప్పుడు తీసుకొచ్చిన చట్టం మాత్రం విభజన కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్థాన్ దేశాల్లో మతపరమైన హింసను ఎదుర్కొంటూ భారతదేశానికి రావాలని నిర్ణయించుకున్న ముస్లిమేతర మైనారిటీల కోసం ఉద్దేశించినదని షా వెల్లడించారు. ఇదే సందర్భంలో విపక్షాలపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాలకు ఏ పనీ లేదని అన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్‌ను కూడా స్వార్థ రాజకీయాల కోసం చేసినట్లు వారు విమర్శిస్తుం టారని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోకూడదా..? అని షా ప్రశ్నించారు.

ఆర్టికల్ 370 రద్దును కూడా రాజకీయ లబ్ది కోసం చేసినట్లు ప్రతిపక్షాలు పేర్కొన్నాయని అమిత్ షా మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే చట్టాన్ని ఉపసంహరిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని అన్నారు. వారు ఎన్నటికీ అధికారంలోకి రాలేరని, మోదీ సర్కారు తీసుకొచ్చిన ఈ చట్టాన్ని రద్దు చేయడం అసాధ్యమని షా పేర్కొన్నారు. భారత పౌరసత్వం కోసం అందరికీ తలుపులు తెరిచే ఉన్నాయని ఈ సందర్భంగా అమిత్ షా పేర్కొన్నారు.

సీఏఏ రాజ్యాంగ విరుద్ధమని విపక్షాలు చేస్తున్న వాదనలో వాస్తవం లేదన్నారు. అది ఆర్టికల్ 14కు ఎలాంటి భంగం కలిగించదని వెల్లడించారు. ఈ చట్టంపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. నాలుగేండ్ల కిందట ఆమోదం పొందిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం-2019 (సీఏఏ)ను తాజాగా అమల్లోకి తీసుకొచ్చింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అర్హులైన వారు భారత పౌరసత్వం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఓ పోర్టల్‌ను కూడా ప్రారంభించారు. వెబ్ పోర్టల్‌ను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మంగళవారం అందుబాటులోకి తెచ్చింది.

## పార్శిళ్లు ఇంటి వద్దనే పికప్, డెలివరీ

### త్వరలో మరో కార్యక్రమానికి టీఎస్ఆర్టీసీ శ్రీకారం

**హైదరాబాద్,మార్చి14(వెలుతురు):** ప్రత్యామ్నాయ ఆదాయం పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో లాజిస్టిక్స్ విభాగ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరిస్తున్నామని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. వినియోగదారులకు వేగవంతమైన




సేవలందించేందుకు త్వరలోనే పార్శిళ్లను ఇంటి వద్దనే పికప్, డెలివరీ చేస్తామని ఆయన చెప్పారు. హైదరాబాద్?లోని దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టేషన్ ప్రాంగణంలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ మోడల్ కౌంటర్‌ను సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ ప్రారంభించారు. కొత్త కౌంటర్‌లో ఒక పార్శిల్‌ను బుకింగ్ చేసి రశీదును వినియోగదారుడికి ఆయన అందజేశారు. అనంతరం లాజిస్టిక్స్ విభాగ కొత్త లోగో, బ్రోచర్?ను ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. పార్శిళ్ల హోం పికప్, డెలివరీ కోసం వినియోగించే కొత్త వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం తెలంగాణలో అతివేగంగా పార్శిళ్లను డెలివరీ చేసే వ్యవస్థ అని అన్నారు. ప్రతి రోజు సగటున 15 వేల పార్శిళ్లను బట్వాడా చేస్తున్నామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 60 లక్షల పార్శిళ్లను టీఎస్ఆర్టీసీ బస్సుల్లో రవాణా చేశామని పేర్కొన్నారు. ఆ పార్శిళ్ల రవాణా వల్ల టీఎస్ఆర్టీసీకి సుమారు రూ.120 కోట్ల రెవెన్యూ వచ్చిందని వెల్లడించారు. “సంస్థకు టికెట్ ఆదాయం 97 శాతం వస్తుండగా.. టికెటేతర ఆదాయం 3 శాతమే వస్తోంది. ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పెంచుకోవాలని నిర్ణయించిన సంస్థ.. ప్రైవేట్ మార్కెట్‌కు ధీటుగా లాజిస్టిక్స్ విభాగాన్ని బలోపేతం చేస్తోంది. అందులో భాగంగానే దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టేషన్ ప్రాంగణంలో మోడల్ కౌంటర్‌ను ప్రారంభించాం. త్వరలోనే ఇలాంటి కౌంటర్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయబోతున్నాం. లాజిస్టిక్స్ విభాగ విస్తరణతో పాటు పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు, జీవా వాటర్ బాటిల్‌ను అందుబాటులోకి తీసుకురావడం, బస్ స్టేషన్‌లలో స్టాళ్లను యాజమాన్యం నిర్మిస్తోంది.” అని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో పార్శిళ్ల హోం పికప్, డెలివరీ సదుపాయాన్ని కల్పిస్తున్నామని.. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. లాజిస్టిక్స్ సేవలకు సంబంధించి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం కాల్ సెంటర్ నంబర్ 040-69440069 గానీ, వెబ్‌సైట్‌ను గానీ సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ సీవోవో డాక్టర్ వి.రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పురుషోత్తం, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, సీటీఎం(కమర్షియల్) శ్రీధర్, హైదరాబాద్ ఆర్ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం (లాజిస్టిక్స్) సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బిజెపికి మరో షాక్...

### సిఎం రేవంత్‌తో జితేందర్ రెడ్డి భేటీ
### కాంగ్రెస్‌లో చేరేందుకు మాజీ ఎంపి ఆసక్తి
### బిజెపి టిక్కెట్ నిరాకరణతో పార్టీ మారేందుకు నిర్ణయం

**హైదరాబాద్,మార్చి14(వెలుతురు):** రాష్ట్ర బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. ఎంపీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో జితేందర్ గురువారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చర్చలు జరిపిన అనంతరం కాంగ్రెస్‌లోకి రావడానికి ఆయన సుముఖత వ్యక్తం చేశారు. బీజేపీ నుంచి మహబూబ్ నగర్ ఎంపీ టికెట్ ఆశించిన జితేందర్ రెడ్డికి షాక్‌నిస్తూ ఆ టికెట్‌ని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు కేటాయించారు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన జితేందర్ కాంగ్రెస్‌లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి సీఎం నివాసానికి వెళ్లిన రేవంత్ రెడ్డిని కలిశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డిలు ఆయను సీఎం నివాసానికి తీసుకెళ్లారు. మహబూబ్ నగర్ ఎంపీ సీటును బీజేపీ హైకమండ్.. డీకే అరుణకు కేటాయించడంతో జితేందర్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.

పార్లమెంట్ ఎన్నికల ముందు తెలంగాణలో రాజకీయ నాయకులు ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి జంప్ అవుతున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు.. కేసీఆర్ కు షాకిస్తూ ఇతర పార్టీల్లోకి జంప్ అవుతున్నారు. మరోవైపు, బీజేపీ.. రాష్ట్రంలో మెజార్టీ ఎంపీలు గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా పలువురు బలమైన బీఆర్ఎస్ అభ్యర్థులను పార్టీలో చేర్చుకుని ఎంపీ టికెట్లను కేటాయించింది.

ఈ క్రమంలో మాజీ ఎంపీ , సీనియర్ బీజేపీ నేత జితేందర్ రెడ్డికి టిక్కెట్ నిరాకరించారు. మహబూబ్ నగర్ టిక్కెట్‌ను జితేందర్ రెడ్డి ఆశించారు. అయితే ఆ స్థానాన్ని డీకే అరుణకు ఇచ్చారు. అసంతృప్తికి గురైన జితేందర్ రెడ్డితో కాంగ్రెస్ నేతలతో చర్చలు జరిపింది. ప్రస్తుతం మల్కాజిగిరి కోసం బలమైన అభ్యర్థి కోసం కాంగ్రెస్ వెదుకుతోంది. జితేందర్ రెడ్డికి అక్కడ అవకాశం కల్పిస్తామని ఆఫర్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. 2019 ఎన్నికల సందర్భంగా జితేందర్ రెడ్డికి కేసీఆర్ టిక్కెట్ నిరాకరించారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆయనకు టిక్కెట్ ఇవ్వకపోవడంతో బీజేపీలో చేరారు. అప్పటికి డీకే అరుణక బీజేపీ టిక్కెట్ ఖరారు చేసింది. దీంతో ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా డీకే



అరుణ కోసం ప్రచారం చేశారు. స్వల్ప తేడాతో డీకే అరుణ పరాజయం పాలయ్యారు. అయితే ఆ తర్వాత ఎంపీ టిక్కెట్ కోసం ఇద్దరు నేతలు గట్టిగా ప్రయత్నించారు. ఒకరిని అసెంబ్లీకి పోటీ చేయించేందుకు హైకమాండ్ ప్రయత్నించింది. కానీ ఇద్దరూ పోటీ చేయలేదు. మహబూబ్ నగర్ అసెంబ్లీ స్థానం నుంచి జితేందర్ రెడ్డి కుమారుడికి చాన్సిచ్చారు. కానీ ఆయన ఘోరంగా ఓడిపోయారు. ఈ క్రమంలో ఎపీ టిక్కెట్ కోసం కూడా జితేందర్ రెడ్డి ప్రయత్నించారు. కానీ డీకే అరుణ గత ఎన్నికల్లో స్వల్ప తేడాతోనే పరాజయం పాలు కావడంతో ఆమెకే చాన్సివ్వాలని నిర్ణయించుకున్నారు. వరుసగా రెండోసారి ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉంటే రాజకీయ భవిష్యత్ గందరగోళంలో పడుతుందన్న ఉద్దేశంతో జితేందర్ రెడ్డి పోటీకి సిద్ధమయ్యారు. అయితే మహబూబ్ నగర్ స్థానం నుంచి ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థిగా వంశీచంద్ రెడ్డి ఉన్నారు. ఆయన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా కూడా ఉన్నారు. ఆయనను కాదని జితేందర్ రెడ్డికి టిక్కెట్ ఇచ్చే పరిస్థితి లేదు. అందుకే మల్కాజిగిరి స్థానం ఆయనకు ఆఫర్ చేసే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. చర్చలు కొలిక్కి రావడంతోనే రేవంత్ రెడ్డితో జితేందర్ రెడ్డి భేటీ అయ్యారని తెలుస్తోంది. మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీకి బలమైన అభ్యర్థి లేరు. పలు పేర్లు పరిశీలనలో వచ్చినప్పటికీ అంత బలమైన నేతలుగా ప్రచారంలోకి రాలేదు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, నాగర్ కర్నూలు నేత మర్రి జనార్దన్ రెడ్డి మల్కాజిగిరి నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపారు.

## అన్ని రంగాల్లో దేశాభివృద్ధి...

**మొదటిపేజీ తరువాయి..**

ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్సూరాబాద్- బండ్లగూడ రోడ్డులోని మహవీర్ హరిణ వనస్థలి పార్కులో మార్నింగ్ వాకర్స్‌తో సమావేశం నిర్వహించారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని వాకర్స్‌ను కోరారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. మరోసారి మోదీ ప్రభుత్వమే రావాలని దేశమంతా కోరుకుంటుందని, రాష్ట్రంలోనూ మెజారిటీ సీట్లు బీజేపీయే గెలుచుకోబోతుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి సురేందర్‌నాథ్‌యాదవ్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ డిజిటల్ విప్లవాన్ని ప్రతి సామాన్యుడికి అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత మోదీదేనన్నారు. మూడో సారి ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రజలు తమ ఓటు హక్కుతో ఆశీర్వదించాలన్నారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, క్లశెం రవీందర్‌రెడ్డి, వనిపల్లి శ్రీనివా?సరెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, నర్సింహగుప్తా, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, నవజీనవ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## డికె శివకుమార్‌తో మల్లారెడ్డి భేటీ

**మొదటిపేజీ తరువాయి..**

వెంట ఒకరు కారు దిగుతూ అధికార పార్టీ హస్తంతో దోస్తీ కడుతున్నారు. ఇప్పటికే పలువురు సిట్టింగ్ ఎంపీలతో పాటు మాజీలుగా మారిన పలువురు కీలక నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా మాజీ మంత్రి, ప్రస్తుత మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ తో కలిసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. కర్నాటక కాంగ్రెస్ నేత డికె శివ కుమార్‌తో మల్లారెడ్డి, భద్రారెడ్డి భేటీ ఆసక్తిగా మారింది. బెంగళూరులో డికెను మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి కలిశారు. ఇటీవల ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా మల్లారెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారం జరుగుతోంది. మల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరితే మల్కాజ్‌గిరి పార్లమెంట్ టికెట్ తన కుమారుడికి ఇవ్వాల్సిందిగా కోరుతున్నట్టు సమాచారం. బిఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు మల్లారెడ్డి కుమారుడికి ఆ పార్టీ అధినేత కెసిఆర్ ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. ఐనా తండ్రీ కుమారులు కాంగ్రెస్ అగ్రనేత డికె శివ కుమార్‌ను కలవడం రాజకీయంగా కలకలం సృష్టిస్తోంది. దీంతో పార్టీకి ఎంతో నమ్మిన బంటుగా ఉండే మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత మల్లారెడ్డి త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు స్పష్టం అయ్యింది. ఇప్పటికే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ని మల్లారెడ్డి, మరో నేత మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం కలిసినట్లు తెలుస్తోంది. బెంగళూరులోని ఓ హోటల్లో డీకే శివకుమార్‌తో మంతనాలు జరిపారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ఇరువురు దాదాపు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మల్లారెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అపాయింట్మెంట్ కోరారు. దీన్ని బట్టి అతి త్వరలోనే మల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత బీఆర్ఎస్ నేతలు వరుసగా కాంగ్రెస్, బీజేపీలోకి జంప్ అవుతున్నారు. దీంతో రానున్న లోక్ సభ ఎన్నికలనాటికి బీఆర్ఎస్ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోంది.

## మహిళా దినోత్సవం పురస్కారాలను ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్,మార్చి14(వెలుతురు):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 19 మంది మహిళలకు తెలంగాణ ప్రభుత్వం పురస్కారాలను ప్రకటించింది. తానిపర్తి చికిత (ఆటలు), కుడుముల లోకేశ్వరి (ఆటలు), ముక్తేవి భారతి (సాహితి), దివనపల్లి వీణా వాణి, ఎస్ జబీన్ (లిటరేచర్-ఉర్దు), బండ సరోజన (ఎడ్యుకేషన్-కరికులం), బిన కేశవరావు (హ్యాండి క్రాఫ్ట్), గుఱ్రాల సరోజ (సోషల్ సర్వీస్), జమీల నిషత్ (సోషల్ సర్వీస్), అరిపిన జయలక్ష్మి (స్పెషల్ కేటగిరి), దయ్యాల భాగ్య (డాన్స్-ఫిజికల్ ఛాలెంజ్), ప్రొఫెసర్ అరుణ భిక్షు (కూచిపుడి నృత్యం) అవార్డులకు ఎంపిక చేసింది.

అలాగే.. సునీల ప్రకాశ్ (పేరిణి నృత్యం), బండి రాములమ్మ (బోనాల కోలాటం), గొరిగె నీల (బోనాల కోలాటం), మట్టది సరవ్వ (డప్పు కళాకారిణి), సీహెచ్ పుష్ప (ఏకచక్రపురం రైతు), లుఖ్మా కమ్యూనిటీ (సఫా ఎన్‌జీవో), శక్తి టీమ్ (దక్షిణ మధ్య రైల్వే వుమెన్ ఆర్‌పీఎఫ్) కు అవార్డులను ఎంపిక చేసింది.



# “మహిళాలకు పెద్దపీట వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం”

### కల్యాణ లక్ష్మీ చెక్కుల ను అందించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**వెలుతురు న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా:** రామన్నపేట మండలం MPDO ఆఫీసు లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణి చేసిన నకిరేకల్ గౌరవ ఎమ్మెల్యే వేముల వీరేశం.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తుందనీ... ఎన్నికల హామీలో బాగంగా 6 హామీల్లో 4 హామీలు ఇప్పటికే అమలులోకి వచ్చినయ్ అని మిగిలిన 2 హామీలతో పాటు ముఖ్యమంత్రి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయనున్నారని తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేసిన



కాంగ్రెస్ ప్రభుత్వం.ఈ కార్యక్రమంలో అధికారులు మరియు మండల కాంగ్రెస్ నాయకులు, పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.



**వెలుతురు మునుగోడు నియోజకవర్గం మార్చి 14:**
చౌటుప్పల్ పట్టణ పరిధిలోని లింగోజిగూడెంలో ముఖ్య కార్యకర్తల సమావేశాని ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసిన భువనగిరి పార్లమెంట్ బీజేపి అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ (మాజీ ఎంపీ )



**వెలుతురు మునుగోడు నియోజకవర్గం మార్చి 14:**
మర్రిగూడెం మండల కేంద్రములో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశాని ముఖ్య అతిథిగా హాజరై నాయకులకు,కార్యకర్తలకు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఏ విధంగా సన్నద్ధం కావాలని సూచనలు సలహాలు తొ దిశనిర్దేశం చేసిన భువనగిరి పార్లమెంట్ బీజేపి అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ (మాజీ ఎంపీ )గారు..

# విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పిన సీఐ ఎన్ వెంకటేశ్వర్లు, ఎస్సై టి మల్లయ్య

**వెలుతురు న్యూస్, యాదాద్రి జిల్లా:** రామన్నపేట మండల సిరిపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి స్థానిక రామన్నపేట .వెంకటేశ్వర్లు, మల్లయ్య ముఖ్య అతిథిలుగా పాల్గొని పదవ తరగతి



విద్యార్థులు భయపడకుండా పరీక్షలు మంచిగా వ్రాయాలని పరీక్ష సామాగ్రి అయినటువంటి ఎగ్జామ్ ప్యాడ్, పెన్నులు, విద్యార్థులకు అందజేసి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెల్లా కుమారస్వామి స్థానిక ఎంపీటీసీ బడుగు రమేష్, మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీ నర్సు, మాజీ ఉప సర్పంచ్ శ్రావణ్ రెడ్డి, కూనూరు ముత్తయ్య. అంబటి రవీందర్ రెడ్డి, మాజీ హెడ్మాస్టర్ గోవర్ధనాచారి, సిరిగిరెడ్డి నర్సిరెడ్డి, మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పి సాంస్కృతిక కార్యక్రమాలతో విజయవంతం చేయడం జరిగింది.







ఆల్ ఫోర్స్ స్కూల్స్ అఫ్ జెన్ నెక్స్ట్ వార్షికోత్సవలో పాల్గొన్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ కుమార్

# పిల్లలే నా స్టార్ క్యాంపెయినర్స్

### వాళ్లవల్లే నేను గతంలో లక్ష మెజారిటీతో గెలిచిన,
### విదేశీ కల్చర్ వద్దు.... భారతీయతే ముద్దు
### ఆల్ఫోర్స్ 'ఆనందోత్సవ్'లో బండి సంజయ్ వ్యాఖ్యలు.

**కరీంనగర్, వెలుతురు, మార్చి 14:**
పార్లమెంట్ ఎన్నికల్లో తన స్టార్ క్యాంపెయినర్స్ పిల్లలేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. గత ఎన్నికల్లో వాళ్లు పట్టుపట్టి తమ తల్లిదండ్రులతో ఒట్టేయించుకుని తనకు ఓటేయించడంవల్లే లక్ష మెజారిటీతో గెలిచానన్నారు. ఈరోజు సాయంత్రం కరీంనగర్‌లో ఆల్ఫోస్ విద్యా సంస్థ నిర్వహించిన నిర్వహించిన ఆనందోత్సవ్ కార్యక్రమానికి బండి సంజయ్ హాజరయ్యారు. ఆల్ఫోర్స్ ఛైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడుతూ... అల్ఫోర్స్ విద్యా సంస్థలను విస్తరిస్తూ లక్ష మందికి పైగా విద్యార్థులకు చదువు అందించిన ఘనత నరేందర్ రెడ్డిదని అన్నారు. “భారత సంస్కృతి, సంప్రదాయాలపై దాడులు జరుగుతున్నాయి. వాటిని అడ్డుకోవాలి. మమ్మీ డాడీ కల్చర్ ను అలవర్చుకోవద్దు. అమ్మానాన్న సంస్కృతి ముఖ్యం” అని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతిని విదేశాలు అలవర్చుకుంటున్న తరుణంలో మనం పాశ్చత్య ధోరణిని అవలంబిస్తుండటం బాధాకరమన్నారు. మనం చదువుకున్న చదువు కుటుంబం కోసమే ఉపయోగపడితే దానికి సార్థకత ఉండదని, ఈ దేశానికి కూడా ఆ విజానం ఉపయోపడేలా పిల్లలను తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచిం చారు. ర్యాంకుల కోసం ఆరాటపడాల్సిన అవసరం లేదని, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని కోరారు.


# ప్రతి పల్లె అభివృద్ధికి మోడీ నిధులు



**వెలుతురు మునుగోడు నియోజకవర్గం మార్చి 14:**
చౌటుప్పల్ మండలం ఆరెగుడేం గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశాని ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసిన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.....
భువనగిరి పార్లమెంట్ కి అభివృద్ధి కి బీబీనగర్ AIIMS, MMTS రైలు, కేంద్రీయవిద్యాలయం, 520 km జాతీయ రహదారులు, తిసుకువచ్చిన... మరీయు ప్రతి పల్లె అభివృద్ధికి 14, 15, 16, th ఫైనాన్స్ ద్వారా నరేంద్ర మోడీ గారు నిధులు ఇచ్చారు....
ఈ జిల్లా నుండి మంత్రులుగా ఎమ్మెల్యేలుగా ఎమ్మెల్సీలుగా



ఎంపీలుగా పదవుల్లో ఉండి ఏం అభివృద్ధి చేశారని ఎక్కడైనా బహిరంగ చర్చకు నేను సిద్ధం మీరు సిద్ధమా... అని సవాల్ విసిరిన భువనగిరి పార్లమెంట్ బీజేపి అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ (మాజీ ఎంపీ )



# సంపాదకీయం..

## రైతులను ఆదుకోలేని బీమా పథకాలు

ఎన్నికల్లో హామీలు ఇవ్వడం..గెలిచిన తరవాత నాలుక మడతేయడం నాయకులకు అలవాటుగా మారింది. రైతుల ఆదాయం రెండింతలు చేస్తామన్న మోడీ హామీ పదేళ్లయినా నెరవేరలేదు. నిజానికి దేశంలో పుష్కలంగా నీటివనరులు, సారవంతమైన భూములు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకునే ఇంజనీరింగ్ నైపుణ్యాలను పాలకులు ప్రదర్శించడం లేదు. నదీజలాలు సముద్రం పాలుకాకుండా...ఏటా వరదలతో అతలాకుతలం కాకుండా...ఆనకట్టలు కట్టాలన్న స్పృహలేకుండా పోతోంది. డబ్బుల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు పనికారాకుండా పోతున్నాయి. నదుల అనుసంధానం అన్న మాటే మోడీ ఎత్తడం లేదు. దేశంలో అన్నిరకాల పంటలకు అనువైన నేలలు ఉన్నా, సమగ్ర పంటల విధానం రావడం లేదు. దీంతో రైతులకు పంటలను పండించడం ఎంత కష్టంగా మారిందో..అమ్ముకోవడం అంతకుమించిన భారంగా మారుతోంది. పంటల కొనుగోళ్లు,బీమాల విషయంలో ప్రభుత్వాలు స్పష్టమైన జాతీయ విధానాల ను అవలంబించడం లేదు. దీంతో పంటలు చేతికి వచ్చినప్పుడు ధరలు లేక పోవడం..పంటలు నష్టపోయి నప్పుడు బీమా సొమ్ము అందక పోవడం షరామామూలుగా మారింది. ప్రధానంగా వాణిజ్యపంటల విషయంలో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. దీనిని సవాల్‌గా తీసుకుని రైతులకు అండగా నిలవాల్సిన పాలకులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా సరైన బీమా విధానం లేదు. ఉన్నా రైతులకు అవగాహన లేదు. దీనిని జాతీయ విధానంగా తీసుకుని రవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా పంటలు నష్టపోతున్నరైతులకు సరైన బీమా సౌకర్యం అందడం లేదు. గ్రామాల వారీగా కాకుండా పంట వారీగా బీమా సౌకర్యం రావాల్సి ఉంది. వ్యవసాయం చుక్కాని లేని నావలా తయారవగా వాణిజ్య పంటల సాగు జూదాన్ని తలదన్నింది. మునుపటి ఏడాది మిర్చికి కాస్త రేటు పడటంతో ఖరీఫ్‌లో రైతులు అటు మళ్లారు. రికార్డు స్థాయిలో ఎపిలో లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి అయింది. కౌలు రైతులకైతే లక్షన్నర. పెట్టుబడులు పూర్తిగా నష్టపోయిన రైతులు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో మిర్చికి తామర తెగులు పలు రాష్ట్రాల్లో వ్యాపించినందున జాతీయ విపత్తుగా ప్రకటించి సాయం చేయాల్సిన కేంద్రం చేతు లెత్తేసింది. రాష్ట్రం కేంద్రాన్ని నిలదీయకుండా లేఖలతో సరిపెట్టింది. వీరిద్దరి మధ్య రైతులు సమిధలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వమైనా మిర్చి రైతులను ఆదుకుందా అంటే అదీ లేదు. అధ్యయన కమిటీల పేరుతో కాలక్షేపం చేసింది. అలాగే గతంలో వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు స్వల్ప విస్తీర్ణానికి పదో పరకో ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ఎంత మందికి ఎంత మొత్తంలో ఎప్పటికి ఇన్సూరెన్స్ వస్తుందో పెద్ద పజిల్‌గామారింది. ఒక వైపు అంతుబట్టని తెగుళ్లు, వైరస్‌లు ఇంకో వైపు నకిలీ, కల్తీ విత్తనాల కారణంగా విపరీతంగా నష్ట పోతున్నారు. వీటిని తట్టుకోలేని రైతులు ఉసురు తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆదుకోవడానికి సమగ్ర పంటల బీమా ఉండాల్సిందే. రైతులు ఏ రకంగా పంటలు నష్టపోయినా అండగా ఉండేలా బీమా సౌకర్యం రావాల్సి ఉంది.పట్టెడన్నం పెట్టే రైతులు తమకు చిన్నబాధ వచ్చినా తట్టుకోలేని దైన్య స్థితిలో ఉన్నారు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో పత్తి,మిర్చి పంటలతో పాటు,పసుపు రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానంగా మిర్చి రైతులు తెగుళ్ల కారణంగా లక్షలాది రూపాయాల నష్టాన్ని మూటగట్టుకున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో సాగయ్యే రెండు ప్రధాన వాణిజ్య పంటలు మిరప, పత్తి రైతాంగం ఆసాంతం పెట్టిన పెట్టుబడులు కోల్పోయి ప్రభుత్వ పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. మిర్చికి ఇటీవల రికార్డు ధరలు పెరిగాయి. కానీ ధరలు పలికిన సమయానికి మిర్చి బాగా దెబ్బతింటోంది. ఎపిలో ఎప్పటి నష్టాలకు అప్పుడే పరిహారం అంటున్న సర్కారు మిర్చి, పత్తి విషయంలో నాన్చుడు దారి పట్టి రైతులను క్షోభకు గురి చేస్తోంది. తామర తెగులు సోకి మిర్చి, నకిలీ విత్తనాల వలన పత్తికి నష్టం వాటిల్లగా, ఈ నష్టాలకు ప్రభుత్వ పూచీ ఏమిటో ఇప్పటికైతే స్పష్టత లేదు. వివిధ కారణాలతో పంట నష్ట పోయిన రైతులకు తక్షణం పరిహారం అందించి ఆసరా కల్పించాల్సిన సర్కారే సాకులు చెప్పి పరిహాసం ఆడటం అమానవీయం. పరిహారంపై రైతులకు కనీసం భరోసా సైతం కల్పించకపోవడం అన్యాయం. ప్రభుత్వ తీరుపై ఆగ్రహించిన మిర్చి, పత్తి రైతులు రోడ్డెక్కుతున్నారు. పత్తి రైతుల గోడు చెప్పనలవి కాదు. నకిలీ, కల్తీ, నాసిరకం విత్తనాల వలన పంట నష్టపో యిన రైతులకు కంపెనీల నుండి పరిహారం ఇప్పించేందుకు 2011లో ప్రభుత్వం ఇచ్చిన జీవో పైనా ఇలాగే కంపెనీలు కోర్టుకెళ్లాయి. ఇక్కడా ప్రభుత్వ స్పందన లేదు. దాంతో ప్రభుత్వం కంపెనీలకు అనుకూలంగా ఉందనే భావన కలుగుతోంది. గతంలోనూ నకిలీ మిర్చి నారు, మిర్చి విత్తనాలతో రైతులు నష్టపోయారు. ఇంతా జరుగుతున్నా ఆర్‌బికెలు, గ్రామ సచివాలయాలు, ఇంటెలిజెన్స్, పోలీస్, వ్యవసాయ శాఖలు ఏం చేస్తున్నాయో తెలీదు. నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆ దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలి. నష్టపోయిన మిర్చి, పత్తి రైతులను సత్వరం ఆదుకోవాలి. వారికి జాతీయస్థాయిలో పంటల బీమాను తీసుకుని రావాలి. అప్పుడే వారికి న్యాయం జరుగుతుంది. ఈ వైపుగా ఆలోచనలు చేసి సమగ్ర పంటల బీమా అమల్లోకి తీసుకుని రావాల్సి ఉంది. అలాగే నకిలీ విత్తనాలు అంటగట్టే వ్యాపారులపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి.

## కొడుకు రాజకీయ ఎదుగుదలే లక్ష్యం

జిల్లాలో సీనియర్ బిఆర్ఎస్ నేత,మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మరోమారు వార్తల్లో నిలిచారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న ఆయన రాష్ట్ర రాజకీయాల్లో తన కుమారుడు అమిత్ ఎదుగుదలను చూసి ఆనందించాలని భావిస్తున్నారు. అందుకోసం ఎంపిగా నిలబెట్టే క్రమంలో రాజకీయ ఎత్తులు వేస్తున్నారు. ఇంతకాలం ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న గుత్తా ..ఇప్పుడు సైలెంట్‌గా ఉన్నారు. మండలి ఛైర్మన్ అన్నది అత్యున్నతపదవే అయినా రాజకీయంగా పెద్దగా ముందుకు సాగే ఛాన్స్ ఉండదు. మండలి చైర్మన్ కావడంతో జిల్లాలో రాజకీయంగా చక్రం తిప్పే స్థానం ఉండదు. దీనికితోడు గుత్తా సుఖేందర్ రెడ్డికి సొంత జిల్లాలోనే కొందరు పొగ పెడుతున్నారని ప్రచారం ఉంది.మండలి చైర్మన్‌గా రెండోసారి అవకాశం ఇచ్చినా...తన కొడుకును ఎంపిగా చూడాలన్న కోరికతో ఉన్నారు. ఈ క్రమంలో ఆయన తనయుడు ఇటీవలే సిఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో భేటీ అయ్యారు. భువనగిరి ఎంపి స్థానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి వివాద రహితుడిగా మృదు స్వభావి గా పేరుంది. వార్డు సభ్యుడిగా రాజకీయ అరంగ్రేటం చేసిన గుత్తా టీడీపీ నుంచి 1999లో నల్గొండ ఎంపీగా గెలిచి పార్లమెంట్లో అడుగు పెట్టారు. రాజకీయ సమీకరణాల్లో భాగంగా 2009లో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో నల్గొండ ఎంపీగా రెండోసారి విజయం సాధించారు. తిరిగి 2014లో వరుసగా మూడోసారి కాంగ్రెస్ ఎంపీగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. మారిన రాజకీయ సమీకరణాలతో తన అనుచరులతో కలిసి గుత్తా సుఖేందర్ రెడ్డి గులాబీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర స్థాయిలో సీఎం కేసీఆర్ ఏర్పాటుచేసిన రైతు సమన్వయ సమితి తొలి చైర్మన్ గా వ్యవహరించాడు. ఆ తర్వాత ఎమ్మెల్సీగా నామినేట్ అయిన గుత్తా సుఖేందర్ రెడ్డి శాసన మండలి రెండో ఛైర్మెన్ గా 21 నెలలపాటు వ్యవహరించారు. ఆ పదవి నుంచి గుత్తా దిగిపోయిన నాటి నుంచి ఖాళీగానే ఉంది. తిరిగి రెండోసారి 2021 నవంబర్ లో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నిక య్యారు. అయితే కాంగ్రెస్ నుంచి టిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నప్పటి నుంచి గుత్తా సుఖేందర్ రెడ్డి క్యాబినెట్ లో బెర్త్ ఆశించారు. ఎప్పుడూ ప్రజాక్షేత్రంలో ఉండేందుకు ఇష్టపడే సుఖేందర్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీలో చేరిన తొలినాళ్లలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా ప్రభుత్వం



నియమించింది. ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక 2019 సెప్టెంబర్ 11 నుంచి గతేడాది జూన్ 3వరకు మండలి చైర్మన్ గా పనిచేశారు. మరో మారు చైర్మన్ పదవి దక్కడంతో ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారనే భావించాలి. అయితే గతంలో గుత్తా శాసనమండలి చైర్మన్ అయినప్పటికీ ప్రజలతో, పార్టీ కేడర్ తో సత్సంబందాలు కొనసాగించారు. నాగార్జునసాగర్ ఉపఎన్నిక, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గుత్తా తెరవెనక పాత్ర పోషించారు. మండలి చైర్మన్ పదవిలో గుత్తా ఎన్నాళ్లు కొనసాగుతారనే విషయం పక్కన పెడితే భవిష్యత్తులో తన కుమారుడి రాజకీయ ఎదుగుదల కోసం ఆయన తాపత్రయ పడుతున్నారు. కొడుకును ఎంపిగా చేస్తే ఇక తనకు తిరుగుండదని భావిస్తున్నారు. కాంగ్రెస్‌లో టిక్కెట్ లభిస్తే గుత్తా కూడా ప్లేట్ ఫిరాయిస్తారని ప్రచారం ఉంది. అయితే అమిత్‌కు కాంగ్రెస్ టిక్కెట్ ఇస్తుందా అన్నది చూడాలి.

# కేంద్ర నిధులపై వాస్తవాలు-వక్రీకరణలు

'నిజం కూడా ప్రతి రోజూ ప్రచారం లో ఉండాలి. లేకుంటే అబద్ధమే నిజంగా మారి దేశాన్ని నాశనం చేస్తుంది' డా. బిఆర్ అంబేద్కర్. 'నిజం గడప దాటే లోపు.. అబద్ధం వెయ్యి మైళ్ళు ప్రయాణిస్తుంది. అయితే, నిజం గడప దాటిన మరుక్షణమే.. అబద్ధం అదృశ్యమవుతుంది' అంటుంటారు పెద్దలు. ఈ విషయం కేంద్ర నిధుల విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారానికి సరిగ్గా సరిపోతుంది. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం నుంచి తగినంత ఆర్థిక సాయం రావడం లేదని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గత కొంత కాలంగా అవాస్తవ ఆరోపణలు చేస్తున్నాయి. బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ తదితర రాష్ట్రాలు కేంద్రం తమకు తక్కువగా నిధులు ఇస్తోందని పదేపదే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

మొన్నటిదాకా తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో వున్న బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇవే తప్పుడు ఆరోపణలు చేసింది. కానీ, బిజెపి అగ్రనాయకులు ఎప్పటికప్పుడు ఈ తప్పుడు ఆరోపణలను తిప్పికొడుతూ వచ్చారు. ఏటా కేంద్రానికి జమ అయ్యే కార్పొరేషన్, వెల్త్ ట్యాక్సు, సెంట్రల్ జిఎస్‌టి, కస్టమ్స్, యూనియన్ ఎక్సైజ్ డ్యూటీ, సర్వీస్ ట్యాక్సు కలిపి ట్యాక్స్ పూల్‌లో జమ అవుతాయి. ఈ మొత్తం పన్నుల ఆదాయంలో 41% రాష్ట్రాలకు కేంద్రం పంచుతుంది. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిధులు విడుదల చేయడం దయతో ఏమీ కాదని, అది రాజ్యాంగ బాధ్యత అని, రాష్ట్రాల హక్కు అని బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పదే పదే మాట్లాడేవారు. కానీ, వాస్తవంగా గతంలో తెలంగాణలోని బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర నిధులను సక్రమంగా వాడుకోకుండా, కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలంగాణలో అమలు చేయకుండా రాష్ట్రానికి నష్టం చేసిందనే అభిప్రాయాలు సర్వత్రా ఉన్నాయి.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలందరికీ ఉచితంగా 5 కిలోల చొప్పున రేషన్ బియ్యం సరఫరా చేసింది. కానీ, ఆనాటి సిఎం కెసిఆర్ గత పదేళ్లలో తెలంగాణలో కొత్త రేషన్ కార్డులే ఇవ్వలేదు.కొత్త రేషన్ కార్డులిస్తే, అందులో ఎక్కడ మోడీ ఫోటో పెట్టాల్సి వస్తుందోననే కుట్రతోనే కొత్త రేషర్ కార్డులను ఇవ్వకపోవడంతో పేదలకు తీవ్ర అన్యాయం జరిగింది. తెలంగాణ ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వం రేషన్ బియ్యం ఉచితంగా ఇస్తుంటే అవన్నీ తామే ఇచ్చినట్లుగా బిఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. దేశంలో 4 కోట్ల మందికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తుంటే ఆ నిధులతోనే డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి, తమ గొప్పగానే చెప్పుకుంది. అలాగే, పేదలకు వైద్య సౌకర్యాలందించేందుకు ప్రజలకు మంజూరు చేసిన ఆయుష్మాన్ భారత్ సేవలను కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు అందకుండా చేసిందనే ఆరోపణలున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కోట్లాదిమంది పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోంది.

వీటిపై గ్రామీణ స్థాయిలో చాలా మందికి అవగాహన లేకపోవడం వల్ల లబ్ధి చేకూరడం లేదని కేంద్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది.ఈ కారణంగానే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలు, ఎవరెవరు ఈ పథకాలకు అర్హులు అనే పూర్తి సమాచారాన్ని అట్టడుగు స్థాయి వర్గాల ప్రజలకు వివరంగా చెప్పేందుకే ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. గడిచిన పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమాలను గ్రామస్థాయిలో వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.

కేంద్ర పథకాల్లో ప్రధానంగా ఆయుష్మాన్ భారత్ పిఎంజెఎవై, ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ), ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ప్రధాన మంత్రి విశ్వకర్మ, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి), ప్రధాన మంత్రి పోషణ్ అభియాన్, జల్ జీవన్ మిషన్, గ్రామాల సర్వే, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన తరంతో మ్యాపింగ్ (ఎస్‌విఎంఐటివిఎ),




రూపొందించడం జరిగింది. దేశంలో ప్రధాని మోడీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలన్నీ ఈ యాత్రలో ప్రతిబింబిస్తున్నాయి. ప్రధానంగా దేశంలోని గిరిజనులు, ఆదివాసీల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు, చర్యలను వివరించేందుకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఎంతగానో తోడ్పడుతున్నది.దీనిని నవంబర్ 15 వ తేదీన ఆదివాసీ గౌరవ్ దివస్ సందర్భంగా స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీయే జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జార?ండ్‌లోని ఖుంటి జిల్లా వేదిక అయింది. ఆ తరువాత వివిధ ప్రాంతాలకు విస్తరిస్తున్నది. ఈ యాత్ర దేశంలోని 24 రాష్ట్రాల్లోని 68 జిల్లాలతో పాటూ కేంద్ర పాలిత ప్రాంతాల్లో సాగుతున్నది.దేశ వ్యాప్తంగా 8,500 పై చిలుకు గ్రామ పంచాయతీల్లో ఈ జన్‌ధన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత, గృహ నిర్మాణం, వ్యవసాయం, ఆర్థిక చేయూతకు సంబంధించిన పథకాలపై ఊరూరా, వాడవాడలా విస్తృతంగా ప్రచారం జరుపుతున్నారు. కేంద్ర పథకాలతో ఇప్పటికే లబ్ధి పొందిన వారి నుంచి కొన్ని సూచనలు, సలహాలు సేకరిస్తున్నారు. ఈ సంక్షేమ పథకాల గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో నేరుగా వారినే అడిగి తెలుసుకుంటున్నారు. అబద్ధం దర్జాగా బతుకుతూ ఏదో ఒక రోజు చస్తుంది. కానీ, ఏనాటికైనా నిజమే భవిష్యత్‌కు చరిత్రగా మారిపోయి, నిత్యం వర్ధిల్లుతుందనే విషయాన్ని అందమైన అబద్ధాలను నమ్మిస్తూ, నటిస్తూ చెప్పే వారు గుర్తెరగాలి.

# మట్టి పరిమళాలు అద్దిన కవి కందికొండ

తెలుగు సినీ పరిశ్రమలో ఇప్పటి వరకు వచ్చిన పాటల రచయితల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో ప్రత్యేక శైలి ఉంటుంది. ఎవరికి వారు తమ రచలనతో అద్భుతాలు సృష్టించారు. తమ మట్టిపరిమళాలను వెదజల్లారు. అందులో ఎందరో ప్రజలకు తమదైన శైలిలో సాహిత్యాన్ని అందించి సినీ రంగానికి పరిమళాలు అద్దారు. పాటలేకుండా సినిమాను ఊహించడం కష్టం. అలాంటి సందర్భాల్లో

కందికొండ యాదగిరి ఓ సామాన్య కుమ్మర కుటుంబంలో జన్మించి చిత్రసీమలో అద్భుతమైన పాటలు అందించడం..అవి కూడా బహుళ జనాదరణ పొందడం నిజంగా గర్వకారణం. అయితే అనూహ్యంగా చిన్న వయసులోనే అతను మరణించాడు. మార్చి 12న వర్ధంతి. ఎందుకనో నటులకు వచ్చిన గుర్తింపు, ఆర్థిక ప్రోత్సాహం కవులకు రావడం లేదు. అందుకు కందికొండ జీవితమే ఉదాహరణ. నిజానికి పాటల రచయితలు కూడా తమవంతుగా డిమాండ్ చేసే స్థాయి రావాలి. మహబూబాబాద్ జిల్లా

నర్సంపేట మండలం నాగుర్లపల్లిలో సాంబయ్య-కొమురమ్మలకు జన్మించిన కందికొండ సినీ రంగంలోఓ తనకు కూడా ఓ పేజీ లిఖించుకుంటారని ఓవరు కూడా ఊహించి ఉండరు. తెలంగాణ ఉద్యమ సమయంలో తన పాటలతో ఊర్రూతలూగించిన కందికొండ సహజకవిగా గుర్తింపు పొందారు. తెలంగాణ పాటలు కూడా చాలా రాశారు. 'చిన్ని మాబతుకమ్మ, 'రేలారే రేలారే' 'కన్నేపల్లి జంగలిలో' మొలగునవెన్నో బతుకమ్మ, ఉగాది,సంక్రాంతి,బోనాల సంస్కృతి పాటలు రాశారు. తెలంగాణ ఉద్యమంలో పండుగల సమయంలో ఎక్కడ చూసినా, విన్నా కందికొండ పాటలే వినబడేవి. తెలంగాణ ప్రజలను చైతన్యం చేశారు.తెలంగాణ పదాలలో భాషకు సౌందర్యం తెచ్చారు. ప్రతి తెలంగాణ పౌరున్ని పాటలు కదిలించాయి. అలాగే బి.సిలపై, కుమ్మరోల్లపై పాటలు రాశారు. పి.జి పొలిటికల్ సైన్సుతోపాటు తెలుగు చదివడంతో పాటు... సినిమా పాటలపై పిహెచ్.డి చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పట్టా పొందారు. కందికొండ పాటలు చూస్తే ఆయన గ్రామీణ నేపథ్యం ఎంతగా ప్రభావింత చేసిందే అర్థం చేసుకోవచ్చు. బాల్యంనుంచి కష్టపడి పైకి రావడంతో పాటుకుమ్మర కులంలో నిత్యం మట్టితో మమేకం కావడం వల్ల ఆయనకు సాహింతంలో బాగ




చేయితిరిగింది. జానపద పాటలన్నీ అద్భుతాలే. సినిమా రంగంలో దర్శకుడు పూరీజగన్నాద్ 'ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం' లో మల్లీ కూయవే గూవా మోగిన అందెలతో పాట రాసే అవకాశం ఇవ్వడంతో తర్వాత 1300లకు పైగా పాటలు రాశారు. దివంతగ సంగీతదర్శకుడు చక్రీ ప్రోత్సాహంతో పాటలు రాసారు. రజినీకాంత్, బాలకృష్ణ చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, మహేష్‌బాబు, రవితేజ లాంటి పెద్ద హీరోలకు పాటలు రాశారు. అల్లరి పిడుగు, ఆంధ్రవాలా, లింగ, దేశముదురు, ఆప్తుడు,ఒకరాధా ఇద్దరి కృష్ణుల పెళ్లి, చక్రం పోకిరి, దొంగ దొంగది, రణం, పొగరు, చిన్నోడు, స్టాలిన్, ఆదిలక్ష్మి మొదలగు ఎన్నో సినిమాల్లో రాశారు. 'మనసమ్మా నువుండేచోటు చెప్పమ్మా,' 'చూపులతో గుచ్చి గుచ్చి చంపకే', 'గలగలపారుతున్న గోదారిలా..' రామా రామా , మొదలగునవి ఎన్నో పాటలు మారుమోగాయి. మట్టి మనిషి, మంచితనానికి మారుపేరు. సామాన్యంగా,నిరాడంబరంగా జీవించిన కందకొండ తన జీవితంలో అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. వివక్షకు గురయ్యారు.

# ధరలు పెరుగుతున్నా పౌల్ట్రీ పరిశ్రమలో నష్టాలే అధికం

కరోనా దెబ్బతో తొలినాళ్లలో పౌల్ట్రీ పరిశ్రమ విలవిల్లాడుతోంది. చికెన్ అమ్మకాలు తగ్గాయి. పలు ప్రాంతాల్లో అయితే ఏకంగా కోళ్లను బొందపెట్టారు. అమ్ముకోలేక, కోళ్లను సాకలేక రైతులు నానాయాతన పడ్డారు. చికెన్ కిలో ధర 50కి పడిపోయింది. కానీ ఇప్పుడు మళ్లీ ధరలు పెరిగాయి. కిలో 300కుచేరువలోకి వచ్చింది. దీనికితోడు ఎండాకాలం కావడంతో మరింతగా ధరలుపెరిగే అవకాశం ఉంది. అయినా నష్టాలు తప్పడం లేదని పౌల్ట్రీరైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లలో కరోనా దెబ్బకు అన్ని రంగాల్లో మాంద్యం నెలకొంది. మార్కెట్లు కుప్పకూలాయి. బంగారం ధరలు అందుకోలేనంతగా పెరుగుతున్నాయి. ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నవారికి ప్రభుత్వం పారిశ్రామిక రాయితీలు ఇస్తూ వస్తోంది. కానీ ధరలతో దెబ్బతింటున్న సామాన్యులకు మాత్రం ఊరట దక్కడం లేదు. రాష్ట్రంలో పౌల్ట్రీరంగం దాదాపు 25 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నది. కోళ్లు, గుడ్లు మంచి ప్రొటీన్ అని, ఎలాంటి అనుమానాలు లేకుండా తినాలని.. వస్తున్నప్రచారం నేపథ్యంలో ఇప్పుఊడిప్పుడే పౌల్ట్రీ పరిశ్రమ మళ్లీ పుంఉకుంటోంది. కరోనా కారణంగా పౌల్ట్రీ రంగం కుదలేయ్యింది. మనిషి ప్రాణాలతో చెలగాటమాడుతున్న మాయదారి మహమ్మారి కరోనా.. అన్నిరంగాలను దెబ్బేసింది. దీనికి తోడు వేసవిలో సాధారణంగా వచ్చే వైరసతో కోళ్లు చనిపోతుండడం కూడా పరిశ్రమకు శాపంగా మారింది. బర్డ్ ఫ్లూ వచ్చినపుడు ఎలాంటి పరిస్థితి



ఉందో కరోనా కారణంగా పరిస్థితి ఘోరంగా ఉంది. కేవలం అపోహల వల్లే పరిశ్రమ దారుణంగా దెబ్బతింది. బర్డ్‌ఫ్లూ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పావలా వడ్డీకి రుణాలు ఇప్పించాయి.

ఇప్పుడు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోకపోతే పౌల్ట్రీ రంగం నామరూపాల్లేకుండా పోతుంది. దీనిపై ఆధారపడ్డ అనేక అనుబంధ పరిశ్రమలూ దెబ్బతింటాయి. దీని నుంచి గట్టెక్కకపోతే ఈ రంగంపై ఆదారపడి జీవిస్తున్న లక్షలాదిమందికి ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉంది.



# బస్తీలోని ప్రతి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తా...

### పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు చంద్ర రెడ్డి

**కూకట్‌పల్లి వెలుతురు:** కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని ప్రతి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి అన్నారు. బస్తి లోని రోడ్ నెం.3 బి బ్లాక్, , రోడ్ నెం. 6 సి బ్లాక్ లలో నూతన భూగర్భ డ్రైనేజీ పనుల కోసం సంబంధిత విభాగం అధికారులు పంపించిన పైపులను చంద్రారెడ్డి దగ్గరుండి ఆయా లైన్ లలో పక్కన పెట్టించారు. వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీలోని ప్రతి సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాశ్వతంగా పరిష్కరింప జేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తి నేత కె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్..

**ఆల్విన్ కాలనీ వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని మొగులమ్మ కాలనీలో గతంలో నిధులు మంజూరై ఇప్పుడు నిర్మాణ పనులు జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ



మొగులమ్మ కాలనీలో గతంలో నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ చిన్నగా ఉండడంతో నిత్యం పొంగిపొర్లుతూ ప్రజాలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలనీలో నివాసాలు పెరిగినందున ప్రజల అవసరాల దృష్ట్యా ఇప్పుడు ఒక ఫీట్ పైప్ లైన్ తో పెద్ద డ్రైనేజీ వ్యవస్థ నిర్మించేందుకు పనులు ప్రారంభించారని అన్నారు. నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబందింత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాన్, భాస్కర్, మల్లేష్, నాగరాజు, సాయిగౌడ్, కేబుల్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా..

### శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్..

**శేరిలింగంపల్లి, వెలుతురు:** కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్బెస్టాస్ హిల్స్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ ని



వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలవాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండి ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నరేష్, నర్సిములు, మహమ్మద్ హుస్సేన్, ఎం.ఏ. రఫిక్, పుష్ప, మహమ్మద్ ఇసాక్, మెహ్రాజ్, తదితరులు పాల్గొన్నారు.



**వెలుతురు మునుగోడు నియోజకవర్గం మార్చి 14:**
నారాయణపురం మండల కేంద్రములో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశాని ముఖ్య అతిథిగా హాజరై నాయకులకు,కార్యకర్తలకు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఏ విధంగా సన్నద్ధం కావాలని మార్గ నిర్దేశం చేసిన భువనగిరి పార్లమెంట్ బీజేపి అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ (మాజీ ఎంపీ)గారు...

# జహీరాబాద్ రైల్ సర్వీస్ అభివృద్ధి కోసం సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేసిన DRUCC మెంబర్ షేక్ ఫరీద్

**జహీరాబాద్, మార్చి, 14 వెలుతురు :**
సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో పర్యటించి రైల్వే స్టేషన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారికి DRUCC మెంబర్ షేక్ ఫరీద్ స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.
ఈ సందర్భంగా DRUCC మెంబెర్ షేక్ ఫరీద్ సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కి రైల్ సర్వీస్ అభివృద్ధి కోసం జహీరాబాద్ ప్రజల అభ్యర్థనలను వారి ముందు ఉంచి వినతి పత్రం అందజేశారు.

### జహీరాబాద్ మీదుగా రైలు నం.1106 బీదర్ ముంబైని ప్రారంభించాలని అభ్యర్థన..

చాలా మంది ప్రజలు వ్యాపారం మరియు వ్యక్తిగత ప్రయోజనాల నిమిత్తం తరచుగా ముంబైకి వెళ్తుంటారు... బీదర్-ముంబై రైలు నం.1106 జహీరాబాద్ నుండి ప్రారంభమైతే అది జహీరాబాద్ పరిధిలోని ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని మరియు రైల్వే శాఖకు ఆదాయాన్ని కూడా పెంచుతుందని తెలిపారు...

### రైలు నెం.07609/07610 పూర్ణ తిరుపతిని ఎక్స్ప్రెస్‌ని జహీరాబాద్‌లో ఆపాలని అభ్యర్థన

జహీరాబాద్‌లోనీ చాలా మంది ప్రజలు తిరుపతి తీర్థయాత్రను సందర్శిస్తారని... రైలు నెం.07609/07610 - పూర్ణ తిరుపతి జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను దాటుతుంది. కావున, వీలైనంత త్వరగా జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు నెం.07609/07610 నిలుపుదలకు అవసరమైన ఏర్పాట్లు చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించవలసిందిగా కోరుతున్నాము.

### కోహీర్ పట్టణం సంగారెడ్డి జిల్లా దక్షిణ మధ్య రైల్వే సమీపంలోని LC నెం.24 వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం అభ్యర్థన

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ అని... కోహీర్ గ్రామం, సంగారెడ్డి జిల్లా. ఇది NH-65ని కర్నాటకకు కలిపే ప్రధాన రాష్ట్ర రహదారి & తరచూ గేట్‌ను మూసివేయడం వలన ఈ రహదారిలో అసౌకర్యం మరియు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నయి



కావున, సంగారెడ్డి జిల్లా, కోహీర్ పట్టణంలోని Lc No.24 ROB నిర్మాణానికి వీలైనంత త్వరగా సదుపాయం కల్పించాలని కోరుతున్నాము.

### సంగారెడ్డి జిల్లా, కోహీర్ రైల్వే స్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని అభ్యర్థన

జహీరాబాద్ నియోజకవర్గంలో సంగారెడ్డి జిల్లాలో ఒక కోహీర్ గ్రామం ఉందని మరియు అది హైదరాబాద్-బీదర్-ఔరంగాబాద్ రైల్వే లైన్ మార్గంలో వస్తుందని మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాను. ఇది ఒక మేజర్ గ్రామ పంచాయతీ మరియు మండల కేంద్రం కూడాను.. ఎక్స్‌ప్రెస్ రైలు స్టాపే లేదు & కోహీర్ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆగాలని కోహీర్ ప్రజల నుండి చాలా కాలంగా డిమాండ్ ఉంది. కాబట్టి, కోహీర్ రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లను వీలైనంత త్వరగా నిలిపివేసేలా ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.



### జహీరాబాద్ నుండి రైలు నం.77655 (డెమో) బీదర్ కల్బుర్గిని ప్రారంభించమని అభ్యర్థన.

రైలు నెం.77655 (డెమో) బీదర్ నుండి కల్బుర్గికి ఉందని మీ దృష్టికితీసుకురావాలనుకుంటున్నాను. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు కల్బుర్గి, బీదర్‌లకు తరచూ వస్తుంటారు. బీదర్ కల్బుర్గి రైలు నెం.77655 (డెమో) జహీరాబాద్ నుండి ప్రారంభమైతే, అది జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలకు సౌకర్యాన్ని కల్పిస్తుంది మరియు రైల్వే శాఖకు ఆదాయాన్ని పెంచడంలో కూడా ఇది సహాయపడుతుంది. కావున, రైలు నెం.77655 (డెమో) బీదర్-కల్బుర్గి జహీరాబాద్ రైల్వేస్టేషన్ నుండి బయలుదేరేలా ఏర్పాటు చేయవలసిందిగా కోరుతున్నాము.

### వికారాబాద్ - లాతూర్ రోడ్డు/పర్లి వైజనాథ్ లైన్‌ను డబ్లింగ్ చేయడం కోసం అభ్యర్థన & సూచన.

దయచేసి వికారాబాద్ - లాతూర్ రోడ్/పర్లి వైజనాథ్ రూట్‌లో ట్రాఫిక్ పెరిగిందని గమనించండి, JNPT కంటైనర్ గూడ్స్ రైళ్లు చాలా వరకు ఈ మార్గంలో నడుస్తున్నాయి, కాబట్టి సాఫీగా & వేగం కోసం వికారాబాద్ - లాతూర్ రోడ్డు/పర్లీ వైజనాథ్ మార్గంలో రైళ్లను నడపాలి.






# జహీరాబాద్ బీజేపీ పట్టణ నూతన కార్యవర్గం ఏర్పాటు

### బీజేపీ పట్టణ అధ్యక్షులుగా మఠం విశ్వానాథ్

**జహీరాబాద్, 14 ఫిబ్రవరి వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆదేశాల మేరకు , జిల్లా కార్యదర్శి అరుణ కవలస్ అధ్వర్యంలో జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు మఠం విశ్వనాథ్ సమక్షంలో జహీరాబాద్ బీజేపీ నూతన పట్టణ నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్టు గురువారం బీజేపీ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. వారు ప్రకటనలో వెల్లడించిన వివారాల ప్రకారం....జహీరాబాద్ బీజేపీ పట్టణ అధ్యక్షులుగా మఠం విశ్వానాథ్, ఉపాధ్యక్షులుగా అప్పం శ్రవణ్ కుమార్, కృష్ణ కాంత్, నీలేష్, అర్చన సరడా, ప్రధాన కార్యదర్శిగా పాలింకర్ సంతోష్, బొగ్గుల సంతోష్, కార్యదర్శులుగా శివ పూజ శ్రీకాంత్, దుర్గేష్, ఈప్తి చంద్రశేఖర్, సుభాష్ మున్నూర్, కోశాధికారిగా ఎం చంద్రశేఖర్, అధికార ప్రతినిధిగా వీరేష్ మటపతి లను నియమించినట్టు ఒక ప్రకటన విడుదల చేశారు.

# ఘనంగా మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్ జ్యోతి పండల్ పుట్టినరోజు వేడుకలు

**జహీరాబాద్, మార్చి, 14 వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో బిజెపి మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్ జ్యోతి పండల్ పుట్టినరోజు వేడుకలు బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సంగమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.




అనంతరం కేకు కట్ చేసి బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ యాదవ్, వంశి రెడ్డి, శ్రీకాంత్, దశరథ్, అబ్బు, అఖిలేష్, గౌతమ్, సుధాకర్, మల్లేష్ గౌడ్, ముద్దసిర్, అహ్మద్ తదిరులు పాల్గొన్నారు.

# మల్లన్నసాగర్ ముప్పు గ్రామల సమస్యలు పరిష్కరించాలలి

### కలెక్టర్‌కి వినతి పత్రం అందజేసిన కోమ్ము ఉమేష్ యాదవ్ సిద్దిపేట జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు

**సిద్దిపేట రూరల్, వెలుతురు మార్చ్14:**
సిద్దిపేట జిల్లా నూతన కలెక్టర్ మను చౌదరి ని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది కొమ్ము ఉమేష్ యాదవ్ సిద్దిపేట జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్లన్న సాగర్ ముప్పు గ్రామ నిర్వాసితుల్లో పలువురి సమస్యలు పరిష్కారం కావడం లేదు. సమస్యలు వెంటనే పరిష్క రించాలని చాలామంది ఇబ్బంది పడుతున్నారని వినతిపత్రం అందించడం జరిగింది కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలో పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది



# యాదాద్రి జిల్లా కార్యదర్శిగా తాటిపాముల శివకృష్ణ గౌడ్

### ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నకరికంటి మొగులయ్య

**వెలుతురు న్యూస్: రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన తాటిపాముల శివ కృష్ణ గౌడ్ నీ శాలువాతో సత్కరించిన,ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకరికంటి మొగులయ్య.



బిజెపి నాయకులు బండ మధుకర్ రెడ్డి ,రమేష్, గోపగోని అశోక్ ,బెల్లి లింగస్వామి, సింగు శంకర రెడ్డి, కంచి రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.

**వెలుతురు మునుగోడు నియోజకవర్గం మార్చి 14:**

నాంపల్లి మండల కేంద్రములో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశాని ముఖ్య అతిథిగా హాజరై నాయకులకు,కార్యకర్తలకు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఏ విధంగా సన్నద్ధం కావాలని మార్గ నిర్దేశం చేసిన భువనగిరి పార్లమెంట్ బీజేపి అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ (మాజీ ఎంపీ )గారు.



# 141వ మార్క్స్ వర్ధంతి ఘన నివాళులు

### సిపిఐ (ఎమ్మెల్యే) న్యూ డెమోక్రసీ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్ ):**
స్థానిక వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రపంచ కార్మికుల హక్కుల కోసం , దోపిడీ లేని సమాజం కోసం పోరాటం చేసిన తత్వవేత్త కార్ల్ మార్క్స్ యొక్క వర్ధంతి సందర్భంగా సిపిఐ స (ఎమ్మెల్యే) న్యూ డెమోక్రసీలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా లి సిపిఐ (ఎమ్మెల్యే ) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి . మహేందర్ మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ (జననం మే 5, 1818, ట్రైయర్ , రైన్ ప్రావిన్స్, ప్రుస్సియా (జర్మనీ)-మార్చి 14, 1883, లండన్ , ఇంగ్లాండ్ మరణించారు) విప్లవకారుడు, సామాజిక శాస్త్రవేత్త , చరిత్రకారుడు మరియు ఆర్థికవేత్త అని తెలియజేయడం జరిగింది. మార్క్స్ ప్రచురించిన (1848) కమ్యూనిస్ట్ మానిఫెస్టో , సోషలిస్టు ఉద్యమ చరిత్రలో అత్యంత ప్రసిద్ధ కరపత్రం మరియు ఉద్యమం యొక్క అత్యంత ముఖ్యమైన పుస్తకం అని దాస్ కాపిటల్ రచయిత కూడా అని తెలియజేయడం జరిగింది. దానితోపాటు ఈ ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా మరియు సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా తన జీవితాంతం కృషి చేసిన మహోన్నతుడు కార్ల్ మార్క్స్ అని తెలియజేయడం జరిగింది. 1850 నుండి 1864 వరకు మార్క్స్ భౌతిక దుఃఖంలో జీవించాడు అని మార్చి 1850లో అతను మరియు అతని భార్య మరియు నలుగురు చిన్న పిల్లలను బహిష్కరించారు మరియు వారి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు అని అయినా ఈ దోపిడి వ్యవస్థను కూల్చాలని, సమ సమాజం కోసం, కార్మిక, కర్షక రాజ్యం కోసం తన బాధలను, కష్టాలను కూడా లెక్క చేయకుండా ఈ ప్రపంచ చరిత్రనే మార్చేయడం కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడని పేర్కొనడం జరిగింది. ప్రపంచ కార్మికులారా ఏకంకండి పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని నినాదం ఇచ్చి ప్రపంచ కార్మిక హక్కుల కోసం పోరాడాలని పోరాటాలకు పునాది వేసిన మహనీయుడు కార్ల్ మార్క్స్ అని తెలియజేయడం జరిగింది. నేడు ప్రపంచం మొత్తము కూడా మార్క్సిజం కోసం ఎదురుచూస్తుందని , అంతిమంగా మార్క్స్ కలలు కన్నా సోషలిజం మే ఈ ప్రపంచానికి దిక్సూచి అని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాములు, పి.శ్రీనివాస్, రాజేష్, శ్రీకాంత్, జైపాల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.








# కలిసి పని చేద్దాం సమస్యలు పరిష్కరిద్దాం...

### - ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**కొల్చారం 14 మార్చ్ 2024 (వెలుతురు న్యూస్):**
ఎవరికి వారు వ్యక్తిగతంగా కృషి చేస్తే సమస్యలు సమస్యలు గానే మిగిలిపోతాయని, అధికారులు ప్రజా ప్రతినిధులు అందరం కలిసి పనిచేసే సమస్యలను పరిష్కరిద్దామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కోరబోయిన మంజుల కాశీనాథ్ అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు వారి వారి శాఖ పరమైన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మంజులా కాశినాథ్, జెడ్పిటిసి మేఘమాల సంతోష్ కుమార్ లు మాట్లాడుతూ పంటలపై ప్రభావం చూపే చీడపీడలపై రైతులకు అవగాహన కల్పించాలని, రానున్న వేసవి కాల దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా వైద్యాధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని, సాగునీటి కొరత ఏర్పడకుండా తగిన వసతి కల్పించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, దుంపలకుంట నుండి సంగాపేట గ్రామం వరకు ప్రత్యేక మిషన్ భగీరథ పైప్లైన్ ఏర్పాటుచేసి చుట్టుపక్కల గ్రామాలకు త్రాగునీరు అందజేయాలని సూచించారు.

వ్యవసాయ దారులకు కరెంటు కొరత లేకుండా చూడాలన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలలో అధికారులు తప్పకుండా ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. అపరిష్కృత సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, తాను పై స్థాయిలో చర్చించి పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. ఇకనుంచి ప్రతి మండల సర్వసభ్య సమావేశానికి తాను హాజరవుతానన్నారు. కాగా మొదటిసారిగా సర్వసభ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ని ఎంపీపీ మంజుల కాశీనాథ్, జెడ్పిటిసి మేఘమాల సంతోష్ కుమార్లు శాలువాతో సత్కరించారు. అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వరిగుంతం గ్రామం కుడి చెరువు తండాకు నాలుగు లక్షల రూపాయలతో మంజూరైన సీసీ రోడ్డును కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఎంపీపీ మంజుల కాశీనాథ్, జెడ్పిటిసి మేఘమాల సంతోష్ కుమార్, వైస్ ఎంపీపీ మల్లారెడ్డి, తహసిల్దార్ గఫర్ మియా, ఎంపీడీవో లక్ష్మీనరసింహ, ఎంపీఓ మహిపాల్ రెడ్డి, ఏవో శ్వేతా కుమారి, కరెంటు ఏఈ హైమద్, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, ప్రజా నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# శాతవాహన విశ్వవిద్యాలయంలో వికల్ప-2024

**కరీంనగర్, వెలుతురు, మార్చి 14:**
శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ అఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కామర్స్ మీట్ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చిన విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్ మాట్లాడుతూ 1800 మంది డిగ్రీ, పీజీ విద్యార్థిని విద్యార్థులు ఒకచోట ఒకేసారి వివిధ పోటీలలో పాల్గొనటం అదికూడా విశ్వవిద్యాలయంలో నిర్వహించడం నిజంగా చాలా ఆనందంగా ఉందని అలాగే విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో వివిధ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని పోటీతత్వ భావనలను పెంచుకోవటంవాళ్ళ ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలలో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండ వచ్చని అందుకు వికల్ప లాంటి కార్యక్రమం చాలా ఉపయోగంగా ఉంటుందని అలాగే ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కామర్స్ డిపార్ట్మెంట్ కి అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధి గా వచ్చిన డాక్టర్ బి ఎన్ రావు మాట్లాడుతూ యువత సామాజిక బాధ్యత కలిగి ఉండాలని అలాగే సమాజంలో ఉన్న ప్రజలకు వైద్య విధానాలపైన అవగాహన కల్పించాలని ముఖ్యంగా యువత దేశ భవిష్యత్తు నిర్మాణంపైన తమ వంతు ప్రయత్నం చేయాలనీ కోరారు. ఆచార్య చెన్నప్ప ప్రెసిడెంట్ తెలంగాణ కామర్స్ అసోసియేషన్ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు అన్ని రంగాల్లో ఉపాది పొందుతున్నారని అలాగే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యతో పాటు ఉపాది అవకాశలను పెంచే కోర్స్ లలో పట్టు సాధించాలని కోరారు.

ఆచార్య జె రవికుమార్ జనరల్ సెక్రటరీ తెలంగాణ కామర్స్ అసోసియేషన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని ఈ కార్యక్రమంలో వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు తాము నిర్వహించబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని అక్కడ కూడా తమ ప్రతిభ కనబర్చాలని కోరారు కామర్స్ విద్యార్థులు తమ తమ నైపుణ్యానికి అనుగుణముగా ఉపాది అవకాశలను కనుక్కోవాలని అలాగే పోటీప్రపంచంలో తమ సత్తా చాటాలని కోరారు. డాక్టర్ ఎం వరప్రసాద్ రిజిస్ట్రార్ శాతవాహన యూనివర్సిటీ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వాన్ని పెంచుకోవాలని అలాగే విద్య తో పాటు త్వరగా ఉపాది పొందే మార్గాలను అన్వేశించాలని చెప్పారు.

డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ కంట్రోలర్ అఫ్ ఎక్సమినేషన్స్ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు అత్యున్నత ప్రమానాలను పెంచుకోవాలని కోరారు.

డాక్టర్ ఇ మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా మెరుగైన ప్రదర్శన చేయాలని అన్ని రంగాలలో రాణించాలని కోరారు.

డాక్టర్ డి హారికంత్ వికల్ప-24 కన్వీనర్ మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున సుమారు 1800 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందని సొంత పిల్లలు ఇంటికి వచ్చినంత ఆనందంగా ఉందని మొత్తం 18 ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డిపార్ట్మెంట్ కామర్స్ విద్యార్థుల పట్ల వారిలో పోటీ తత్వాన్ని పెంచే ఇలాంటి కార్యక్రమాలు చేయటంలో ఎప్పుడు ముందు వరసలో ఉంటుందని అలాగే ఇంతకముందు కూడా వికల్ప-2018, వికల్ప-2019 నిర్వహించామని కామర్స్ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించటానికి వారికి అవసరమైన నైపుణ్యాలను పెంచుకునేలా శిక్షణ కూడా ఇప్పిస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, బి. నరేష్, డాక్టర్ పరశురాములు, డాక్టర్ మనోజ కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, బి. అనిల్, సందీప్, వేణు మాధవ్, ఇతర ప్రైవేట్ మరియి గవర్నమెంట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేల...!

**సంస్థాన్ నారాయణపూర్ వెలుతురూ న్యూస్ :**
నారాయణపురం మండల కేంద్రంలోని ఈసీ విద్యాసాగర్ ఆదర్శ పాఠశాలలో గురువారం సపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు వివిధ హోదాలో పాత్రలు పోషించి చక్కగా రాణించారు. ఎమ్మెల్యేగా సౌమ్యనాథ్, ఎంపీగా సూరజ్, కలెక్టర్గా సిరివెన్నెల, డీఈవోగా సరస్వతి, ఎంపీడివోగా ఉజ్వల, ఎమ్మార్వోగా ప్రణయ్, ప్రధానోపాధ్యాయులుగా నిహారిక వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ కట్ల



భాస్కరాచారి బహుమతులను ప్రధానం చేశారు.



## మూత్ర పిండాల వ్యాధుల నివారణకు జాగ్రత్తలు అత్యవసరం....

### కూకట్‌పల్లి రాందేవ్ రావు హాస్పిటల్‌లో కిడ్నీ దినోత్సవం...

**కూకట్‌పల్లి, వెలుతురు:**
ప్రపంచ కిడ్నీ దినోత్సవం పురస్కరించుకొని కూకట్ పల్లి రామ్ దేవ్ రావు హాస్పిటల్ లో డాక్టర్ కమలాకర్ మెడికల్ డైరెక్టర్ ఆద్వర్యంలో వైద్యులు ,రోగులు మరియు రోగులు అటెండర్లుతో కలిసి ప్రపంచ కిడ్ని దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఛాయ దేవి రామ్ దేవ్ రావు గైనిక్ హెడ్ మాట్లాడుతూ ఈ కిడ్నీ రోగులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే కిడ్నీ సమస్యలు రాకుండా ఉంటాయని అన్నారు. అనంతరం డైటిషియన్ అఖిల మాట్లాడుతూ కిడ్నీ రోగులు తీసుకునే డైట్ ను వివరించారు. ఈ సందర్భంగా వారి టీమ్ మెంబెర్ అయిన గ్లోరి ఎవాంజలిన్, సంజన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అలాగే నర్సింగ్ సూపర్డెంట్ మేరి మాట్లాడుతూ డయాలిసిస్ రోగులు నర్సింగ్ కేర్, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం సీఈఓ డాక్టర్. యోబు మాట్లాడుతూ కిడ్నీ రోగుల కుటుంబ సభ్యులు సహకారం చాలా అవసరం అన్నారు. వారి సహకారం తోనే డయాలసిస్ రోగుల మనుగడ సాగించగలుగుతారని అన్నారు. ఈ సందర్భంగా రోగులు, రోగుల కుటుంబ సభ్యులు కిడ్నీ సమస్యలపై అవగాహన కల్పించిన డాక్టర్లను ప్రశంసించారు.
ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి డాక్టర్ రంగనాథ్ , డాక్టర్ లావణ్య, డాక్టర్ రాఘవేంద్ర, భగవాన్ మహావీర్ డయలైసిన్ సెంటర్, స్టాఫ్ మరియు అడ్మినిస్ట్రేటివ్ మెంబెర్స్ ఎబెల్, కృష్ణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిని గెలిపించండి.. రాచకొండకు వెయ్యి కోట్ల నిధులు తెస్తా

### భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్.

**వెలుతురు న్యూస్ నారాయణపూర్:**
సంస్థాన్ నారాయణపురం బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు సుర్వి రాజు గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ హజరై మాట్లాడుతూ బిజెపి,కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని,పార్టీ బలోపితం కోసం కార్యకర్తలంతా సమిష్టి కృషి అవసరమని,ప్రతి గ్రామానికి సోషల్ మీడియా కమిటీలు వేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి పథకాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా తాను గెలుపొందినట్లయితే రాచకొండకు,1000/-వెయ్యి కోట్ల నిధులతో పర్యాటక కేంద్రం ఏర్పాటు చేస్తానని



అన్నారు.మునుగోడుకు నీళ్లు, నిధులు తీసుకువస్తానని కరువు కాటకాలనుండి కాపాడుతానని నిరుద్యోగాన్ని పోగొడతానని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,దోనూరు వీరా రెడ్డి,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్,మునుగోడు అసెంబ్లీ కన్వీనర్,దూడల బిక్షం గౌడ్, రాష్ట్ర కార్యవర్గ,సభ్యులు దాసరి మల్లేశం,వనం ధనంజయ,ఏరెడ్ల శ్రీనివాసరెడ్డి,ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిలు,జక్కలి రాజు యాదవ్, తంగళ్ళ సత్తయ్య ,బిజెపి జిల్లా నాయకులు,వంగరి రఘు,భాస్కర నరసింహ,జక్కర్తి బిక్షం,కుకుడాల మహేందర్ రెడ్డి,వీరమల్ల జంగయ్య గౌడ్,బద్దం యాదయ్య,బండమీది కిరణ్,బద్దం గిరి,గొల్లూరి యాదగిరి, ఎలిజాల శీను,ఏనుగు బుచ్చిరెడ్డి, గూడూరు మంజునాథరెడ్డి,రాజు, శ్రీను రెడ్డి,రాములు,మహేష్,నవీన్, జక్కర్తి గణేష్,నరసింహ,చక్రి, తదితరులు,పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ దేవాలయ కమ్యూనిటీ భవనానికి ఎంపీ ల్యాడ్స్ నుండి నిధులు ...

### - ఎంపి బండి సంజయ్‌కి కృతజ్ఞతలు తెలిపిన గౌడ నేతలు...

**కరీంనగర్, వెలుతురు, మార్చి 14:**
నగరం లోని రేణుక ఎల్లమ్మ దేవాలయ కమ్యూనిటీ భవనానికి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ అందించిన పది లక్షల నిధులతో అదనంగా మరో 10 లక్షల నిధుల ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేశారు. గురువారం రేణుక ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో సమావేశమైన కరీంనగర్ గౌడ కుల ప్రతినిధులు కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేసిన ఎంపీ బండి



సంజయ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ సందర్భంగా గౌడ కుల ప్రతినిధులు మాట్లాడుతూ గతంలో జరిగిన ఎల్లమ్మ జాతర సందర్భంగా ఎంపీ బండి సంజయ్ కుమార్ దేవాలయాన్ని సందర్శించి 10లక్షల రూపాయలు కమ్యూనిటీ భవనము మంజూరు చేయించి భవన నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. ఇటీవల మహా శివరాత్రి సందర్భంగా ఈ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు పర్యవేక్షించిన ఎంపీ బండి సంజయ్ మిగతా పనుల కోసం 10లక్షలు అందిస్తానని చెప్పి , 11వ తేదీన ఎంపీ లాడ్స్ నిధుల నుంచి మరొక 10లక్షలు విడుదల చేశారని పేర్కొన్నారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు అందించిన ఎంపీ బండి సంజయ్ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కోడూరి మహేందర్ గౌడ్, హరి కుమార్ గౌడ్,బత్తిని రాజు గౌడ్,పంజాల సురేందర్ గౌడ్, మహేందర్ గౌడ్ (అడ్వకేట్), సుదగోని ఆంజనేయులు గౌడ్, బండారి గాయత్రి గౌడ్, బత్తిని అనిల్ గౌడ్, బుర్ర సతీష్ గౌడ్, కోడూరి లక్ష్మణ్ గౌడ్, కోడూరి సంపత్ గౌడ్, దుర్గం మురళీ గౌడ్, కోడూరి సతీష్ గౌడ్,వంగ హరీష్ గౌడ్, కోడూరి తిరుపతి గౌడ్ ,ఆలయ పూజారి కోడూరి సురేష్ గౌడ్, పలువురు గౌడ సోదరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయ వేకెన్సీ పోస్టులు ఏమైయాయి?

### ఉపాధ్యాయ వేకెన్సీ పోస్టులలో అక్రమంగా చేరిన ఇతర జిల్లాల వారిని ఆయా జిల్లాలకు తిరిగి పంపి స్థానిక నిరుద్యోగులకు మరియు ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

### సేవ్ రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంస్థ కోర్ కమిటీ సభ్యులు బొడ్డు రవి డిమాండ్

**రంగారెడ్డి జిల్లా వెలుతురు మార్చి 14:**
రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఒకప్పటి సమైక్య రాష్ట్రంలోనూ, నేటి స్వరాష్ట్రం లోనూ రాష్ట్రానికి అత్యధిక ఆదాయ వనరులు అందిస్తున్న జిల్లా రంగారెడ్డి జిల్లా,ఆర్థిక వనరులు అవసరం అయిన ప్రతిసారి ఇక్కడి భూముల అమ్మకాలే జరిగినాయి, ఇక్కడి భూములు బంగారం కాని బతుకులు మాత్రం అంధకారం అయ్యాయి,గత ప్రభుత్వం తీసుకొచ్చిన Pharma City పేరుతో 22వేల ఎకరాల సాగుభూమిని కోల్పోయి దాదాపు 10వేల చిన్న,సన్నకారు రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయి, తమ జీవనోపాధి కోల్పోయారు, రంగారెడ్డి జిల్లాలో అత్యధిక సంఖ్యలో SEZలు ఉన్నప్పటికీ వాటిలో స్థానికుల ఉద్యోగ అవకాశాల వాటా అంతంత మాత్రమే, గత ప్రభుత్వాలు జిల్లాను ఆర్థిక వనరుల కేంద్రంగానే చూసారు గానీ ఇక్కడి ప్రజలను, నిరుద్యోగులను, ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తూనే వచ్చారు.

1978లో జిల్లా ఏర్పడిన నాటి నుండి అనగా PO 1975 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానిక కోటా 80%, ఓపెన్ కోటా 20% అనే నియమాన్ని పాటించకుండా రంగారెడ్డి జిల్లాలో అధిక సంఖ్యలో స్థానికేతరులను నియమించి, స్థానిక నిరుద్యోగ యువతకు అన్యాయం చేయడం జరిగింది.

ఈ అన్యాయాన్ని సరిచేయడం కోసం తెచ్చిన 610 GOను కూడా పూర్తి స్థాయిలో అమలు పరచలేదు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నాడు సుమారు 584 మంది నాన్ లోకల్ ఉపాధ్యాయులను ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నోటిఫై చేసినారు కానీ వారిని వారి సొంత జిల్లాలకు ఇప్పటికీ తిరిగి పంపలేదు, ఇలాంటి సందర్భంలోనే "మా ఉద్యోగాలు మాక్కావాలి" అనే నినాదంతో పోరాడి తెచ్చుకున్న స్వరాష్ట్రం తెలంగాణలో అయినా మా బతుకులు మారుతాయి అనుకుంటే పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లయ్యింది, గత ప్రభుత్వం %ూూ% 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానిక కోటా 95%,ఓపెన్ కోటా 5% అనే నియమ ఉద్దేశ్యాన్ని పక్కదారి పట్టించి రంగారెడ్డి జిల్లాను పూర్తిగా స్థానికేతరుల పునరావాస కేంద్రంగా మార్చారు, 317 %+శీ% అమలు ప్రక్రియలో సీనియార్టీ ఆధారంగా నూతన జిల్లాలకు క్యాడర్ స్ట్రెంత్ ను తేది 21.12.2021 నాడు కేటాయించారు నాడు కేటాయించిన క్యాడర్ స్ట్రెంత్తో పాటు నేటి వరకు ఏర్పడిన ఖాళీలతో క్లీయర్ వేకెన్సీ పోస్టులు పెరగాలి కానీ జిల్లా విద్యాశాఖ అధికారుల తప్పిదాల వలన నూతన రంగారెడ్డి జిలాలోని వివిధ రకాల అప్పిల్స్ అనగా కేటాయింపులో నాకన్నా జూనియర్ రంగారెడ్డి జిల్లాకు కేటాయించారు నాకు సీనియార్టీలో అన్యాయం జరిగింది అని చాలా మంది ఉమ్మడి మహబూబ్ నగర్ ఉపాధ్యాయులు అప్పీల్స్ ద్వారా ఆర్డర్ తెచ్చుకొని రంగారెడ్డి జిల్లాలో 317 Go అలకేషన్ పొందినారు ఇలా ఎంత మంది వచ్చారో అంత మందిని తిరిగి వారి సొంతం జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు తిరిగి పంపాలి కానీ నేటికినీ వారిని పంపలేదు ఇలా వచ్చిన వారిలో %ంజూశీబంవ% ముందుగా వచ్చారు తర్వాత భర్త లేదా భార్య అప్పిల్స్ చేసుకొని నా spouse రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్నారు కావున నన్ను spouse కేటగిరి క్రింద పరిగణలోనికి తీసుకొని నన్ను కూడా రంగారెడ్డి జిల్లాకు కేటాయించండి అని అప్పిల్స్ చేసుకొని ఆర్డర్ ద్వారా రంగారెడ్డి జిల్లాలో 317 Go ద్వారా అలకేట్ అయ్యారు ఈ విధంగా రంగారెడ్డి జిల్లాలోని క్లియర్ వేకెన్సీ పోస్టులలో నియమింపబడినారు,ఇలాగే ఎంతో మంది ఇతర జిల్లాల ఉపాధ్యాయులు పలుకుబడి పైరవీ బదిలీల ద్వారా వచ్చి రంగారెడ్డి జిల్లాలోని క్లియర్ వేకెన్సీ పోస్టులలో చేరినారు. ఈ విధంగా రకరకాల అప్పిల్స్ spouse,widow,seniority మరియు ప్రభుత్వ ఆర్డర్ ద్వారా సుమారు 400 మంది 317 Go అమలు తర్వాత అనగా డిసెంబర్ 2021 నుండి నేటి వరకు రంగారెడ్డి జిల్లాలో ఉన్న క్లియర్ వేకెన్సీ పోస్టులలో కేటాయించడం వలన స్థానిక ఉపాధ్యాయులు ప్రమోషన్ మరియు స్థానిక నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయినారు.

317 Go అమలు ప్రక్రియలో జరిగిన తప్పిదాలను సరిచేసి క్యాడర్ స్ట్రెంత్ లో excess అయినా కోటాను గుర్తించి వారిని తిరిగి వారి సొంత జిల్లాకు పంపించి స్థానిక ఉపాధ్యాయులకు న్యాయం చేయమని విద్యాశాఖకు WPNo 25731 ద్వారా గౌరవ హై కోర్ట్ ఆదేశాలు జారీ చేసినప్పటికినీ రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ తాత్సారం వహిస్తూ కాలయాపన చేస్తున్నది కావున తక్షణమే Excess కోటా లెక్కలు బహిర్గతం చేసి వారిని త్వరగా వారి సొంత జిల్లాలకు పంపాలని సేవ్ రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంస్థ రంగారెడ్డి జిల్లా విద్యాశాఖను కోరుచున్నాము

1. జిల్లాల విభజన పేరుతో మహబూబ్ నగర్ నుండి 10 మండలాలను ప్రస్తుత రంగారెడ్డి జిల్లాకు కలపడం ద్వారా మరియు 317 GO అమలు ద్వారా స్థానికులు స్థానికేతరులుగా, స్థానికేతరులు స్థానికులుగా మార్చారు,ఇక్కడే



పుట్టి, ఇక్కడే పెరిగిన స్థానిక ఉపాధ్యాయులు నేడు స్థానికేతరులు అయ్యారు. దాదాపు 1000 మంది ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు వెళ్ళాల్సి వచ్చింది,అదే సమయంలో మహబూబ్ నగర్ లోని 10 మండలాల వారు రంగారెడ్డికి స్థానికులు అయ్యారు. ఫలితంగా కేవలం రంగారెడ్డి జిల్లా విద్యాశాఖలోనే దాదాపు 1000 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు అనగా 700 లకు పైగా ఉపాధ్యాయులు తమ ప్రమోషన్ల అవకాశాలు మరియు 300 మంది నిరుద్యోగ యువకులు ఉద్యోగ అవకాశం కోల్పోతున్నారు.
2. రంగారెడ్డి 17మండలాల ఉద్యోగ,ఉపాధ్యాయులు మహబూబ్ నగర్ 10 మండలాల ఉద్యోగ,ఉపాధ్యాయులతో పోలిస్తే జూనియర్లుగా మారారు,ప్రతి క్యాడర్ లో,పోస్టులో స్థానిక రంగారెడ్డి వాళ్ళు దిగువ శ్రేణిలో ఉండాల్సి వస్తుంది,సొంత జిల్లాలో ఉండి తమ సీనియారిటీ కోల్పోతున్నారు.మహబూబ్ నగర్ నుండి కేటాయించి ఉపాధ్యాయులందరు కూడా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల కంటే ప్రతి కేటగిరి పోస్ట్ లో సీనియర్స్ గా ఉన్నారు ఇలా ఉండడం కారణం చేత ఇప్పుడు అన్ని ప్రమోషన్స్ మహబూబ్ నగర్ నుండి వచ్చిన వారికే వస్తున్నాయి ఇలా వారికి నూటికి 90 శాతం అవకాశం రావడం స్థానిక ఉపాధ్యాయులకు ప్రమోషన్ దక్కక పోవడం వలన స్థానిక ఉపాధ్యాయులకు తీరని నష్టం జరిగింది,తెలంగాణ స్టేట్ సబార్డినేట్ రూల్ 38 ప్రకారం స్థానిక ఉద్యోగుల హక్కులకు ఎలాంటి భంగం కలుగకూడదు కానీ రంగారెడ్డి జిల్లా విద్యాశాఖలో 317 Go అమలు ద్వారా స్థానిక ఉపాధ్యాయులకు తీరని నష్టం జరిగింది, రంగారెడ్డి జిల్లాలో 317 Go అలకేషన్‌పై నిబంధనలకు లోబడే ఉపాధ్యాయుల కేటాయింపులు జరిగాలి కానీ అలా జరుగలేదు స్థానిక ఉద్యోగుల ప్రమోషన్స్ కోల్పోతున్నారు కావున జరిగిన నష్టం నివారణ చర్యలను సత్వరమే రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ చేపట్టాలి అని కోరుతున్నాము.
3. గత ప్రభుత్వం 2023 ఆగష్టు ప్రకటించిన ఉపాధ్యాయ ప్రమోషన్ లిస్టు SGT నుండి SA లిస్టులో మహబూబ్ నగర్ లోని 10 మండలాల నుండి 90% PROMOTIONS పొందే పరిస్థితి ఉంటే మన రంగారెడ్డిలోని 17 మండలాల నుండి కేవలం 10% మాత్రమే PROMOTIONS వచ్చే పరిస్థితి ఉంది.
4. GO 317 ద్వారా రంగారెడ్డి 17 మండలాలకు, మహబూబ్‌నగర్ 10 మండలాలకు కేటాయించబడ్డ ఉపాధ్యాయ CADRE STRENGTH వివరాలు నేటికి కూడా అధికారులు బయటకి ఇవ్వడం లేదు,రాజకీయ పలుకుబడితో కేటాయింపులకు మించి మహబూబ్ నగర్ నుండి రంగారెడ్డికి ఉద్యోగ, ఉపాధ్యాయులను తీసుకొచ్చారు. దానితో పాటు ఈ GOను అడ్డు పెట్టుకొని, 2021 నుండి నేటి వరకు వివిధ రకాల పద్దతుల ద్వారా దాదాపు 400 మంది స్థానికేతరులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి రంగారెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయ పోస్టుల్లోకి వచ్చారు.
5. GO 317 ద్వారా, GOVT ORDERS పేరుతో అక్రమంగా జిల్లాకు వచ్చిన స్థానికేతరులు తమ భర్త/భార్య వేరే జిల్లాలో పని చేస్తున్నారు అని చెప్తూ తిరిగి వారిని కూడా SPOUSE పేరిట జిల్లాకు తీసుకొచ్చారు,మరో 200 మంది ఇదే దారిలో జిల్లాలోకి రావడానికి రెడీగా ఉన్నారు, ఇలా జిల్లా స్థానిక నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టడానికి కంకణం కట్టుకున్నారు.
6. మొత్తంగా చూస్తే కేవలం ఉపాధ్యాయ పోస్టుల్లోనే 900 ఖాళీలను రంగారెడ్డి జిల్లా నిరుద్యోగులు కోల్పోయారు, D.Ed.,B.Ed చేసిన స్థానిక యువత పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది, DSC Notificationలో ప్రతిసారీ 1000 కి తగ్గని SGT పోస్టులు,పదుల సంఖ్యలో SA పోస్టులు ఉండేవి కానీ నేడు ప్రకటించిన DSC Notificationలో చాలా తక్కువ చూపిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం గత ప్రభుత్వం ఇక్కడి ఖాళీలను స్థానికేతరుల పరం చేయడమే.
7. GO 317 ద్వారా 10 మండలాల్లోనే ఉంచాల్సిన మహబూబ్ నగర్ ఉపాధ్యాయులను అధికారులు రంగారెడ్డిలోని 17 మండలాలకు కేటాయించారు. కొన్ని పాఠశాలల్లో ఖాళీలు లేకపోయినా ఎలాగైనా ఇక్కడకు రావాలనే ఉద్దేశ్యంతో రకరకాల పద్దతులు వాడారు.కొన్ని చోట్ల AGAINST POST అనే పేరుతో తీసుకొచ్చి నింపారు. ఉదా. PHYSICAL SCIENCE TEACHER ను తీసుకొచ్చి SOCIAL STUDIES POST తో భర్తీ చేసారు,అధికారులు తమ స్వార్థం కోసం రంగారెడ్డి జిల్లా విద్యార్థులకు కూడా విద్యను దూరం చేసి అన్యాయం చేసారు.
8. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు సంబంధించిన Reservation Quota స్థానాల్లో సైతం అక్రమ బదిలీల ద్వారా నింపివేసారు,అక్రమాలకు రంగారెడ్డి జిల్లాలో RESERVATION QUOTA% లేదు, PROMOTION QUOTA లేదు, LOCAL QUOTA లేదు, DSC VACANCY QUOTA లేదు.. ఏ ఒక్కటీ మిగలనివ్వలేదు.
9. ప్రతి రెవిన్యూ గ్రామంలో పాఠశాల ఉండాలనే గౌరవ ముఖ్యమంత్రి గారి ఆశయానికి తూట్లు పొడుస్తూ అధికారులు వర్క్ అడ్జెస్ట్మెంట్ పేరిట డెప్యూటేషన్స్ కు తెరలేపారు,తక్కువ విద్యార్థులు ఉన్న గ్రామీణ పాఠశాలలను మూసి వేసి విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది అని తెలిసి కూడా అధికారులు ఆ పది మండలాల నుండి దాదాపు 460 మంది ఉపాధ్యాయులను 17మండలాలలోని పట్టణ ప్రాంతాలకు తీసుకొచ్చారు.

గత ప్రభుత్వం నుండి జిల్లాకు రక్షణ లేకపోవడం,మరోవైపు అధికారుల నిర్లక్ష్య ధోరణితో ఏం చేయలేని స్థితిలో మన జిల్లాకు జరుగుతున్న అన్యాయాలను సరిచేసి న్యాయం చేయాలని గౌరవ న్యాయస్థానాలను ఆశ్రయించి ప్రమోషన్స్ మరియు బదిలీల మీద గౌరవ హై కోర్టు ద్వారా స్టే తెచ్చుకోవడం జరిగింది,

ఇలా జిల్లాకు జరుగుతున్న అన్యాయాలను, బాధలను, గోసలను రాస్తే రామాయణం, చెప్తే మహాభారతం అన్నట్లు తయారయ్యింది, గత ప్రభుత్వం,అధికారులు జిల్లా ప్రయోజనాలకు సమాధికట్టి నడిబజార్లో నిల్పోబెట్టారు.

జిల్లా ఉపాధ్యాయ,ఉద్యోగ మరియు నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడం కోసం గత ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రాతిపదికన జిల్లాను తిరిగి పునర్విభజన చేసుకోవడం ఉత్తమ పరిష్కారమార్గం,17మండలాలతో కూడిన రంగారెడ్డిని ప్రత్యేక జిల్లాగా చేసుకోవడం అంటే 50 నుండి 60Km పరిధిలో ఉండే నాలుగు నియోజకవర్గాల జిల్లా చేసుకోవడం కూడా జిల్లాకు న్యాయం జరుగుతుంది, జిల్లాల పునర్విభజనతో పాటు GO 317 రద్దు చేసి స్థానికత ఆధారంగా ఉద్యోగ,ఉపాధ్యాయుల కేటాయింపులు తిరిగి జరపాలి.

అక్రమంగా జిల్లాలోకి వచ్చిన స్థానికేతర ఉద్యోగ, ఉపాధ్యాయులను వెనక్కి పంపి జిల్లా DSCలో పోస్టులు పెంచి స్థానికత ఆధారంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు అందించాల్సి ఉంది. సత్వరమే జిల్లాకు జరిగిన అన్యాయాన్ని సరిచేసి జిల్లా నిరుద్యోగ యువకులకు ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశాలను కల్పించుటకు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారులు కృషి చేసి నిరుద్యోగులకు మేలు చేయగలరని ఆశిస్తున్నాము.

## బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలి

**వెలుతురు మునుగోడు నియోజకవర్గం మార్చి 14:**
చండూరు మండలం మరియు మున్సిపల్ అధ్యక్షులు ఎర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ కార్యకర్తలకూ మార్గ నిర్దేశం చేసిన అనంతరం మీడియా మిత్రుల సమావేశంలో ప్రసంగిస్తు......
BRS పార్టీ కి రాష్ట్రంలో కాలం చెల్లింది మరియు BRS పార్టీ కి తల్లితండ్రులు పెట్టినా పేరు మార్చుకుని తెలంగాణ రాష్ట్రం తో పేగు బంధం తెచ్చుకున్న అవినీతిని కుటుంబా దొరలా పార్టీ. వాళ్ల కుటుంబం మత్రమే బంగారు కుటుంబం అయ్యింది.
అందుకే BRS Ki VRS ఇచ్చారు ప్రజలూ,
ఇక కాంగ్రెస్ విషయానికి వస్తె హలది కానీ 400 హామీలు తప్పుడు వాగ్ధనాలు తొ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
డిసెంబర్ 9 తేదీన చేస్తాను అన్నా 2లక్షల రుణమాఫీ ఏమైంది...?
రైతు బందు ఊరికి 50 మందికి వేశారు అదీ కూడా (రెండుమూడూ ఎకరాల లోపు) కౌల్ రైతుల పరిస్థితి ఎంటి....?
కూలీలకు వేస్తాను అన్నా పైసలు ఏవీ...?
200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఏమైంది...?
గృహ లక్ష్మి పథకం.... (18 సం,, పైన ఉన్న ప్రతీ మహిళలకు 2500 రూ,, ) ఎటూపాయె...?
అందుకే చెపుతున్న మన కుటుంబానికి , మన ఊరికి ,మన రాష్ట్రానికి, దేశా భవిష్యత్తును ప్రగతి పథంలోకి తీసుకువెళ్తాన్న



నరేంద్ర మోడీజీ మరియు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలు చెప్పుకుంటూ పోతే చేంతాడు అంతా లిస్ట్ ఉంది....
రైతులు పండించిన ప్రతి గింజను నరేంద్ర మోడీ గవర్నమెంట్ కొంటుంది
రైతులకు కిసాన్ సమ్మనిధి ద్వారా 6000 వేల రూ,, ఇస్తున్నాడు
ఉచిత రేషన్ బియ్యం అందిచుస్తున్నడు
ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు 5 కోట్ల ఇండ్లు అందిచినాడు
దేశంలో నరేంద్ర మోడీ జీ గారూ హాయంలో అత్యధిక AIIMS కట్టించాడు
కరోనా కష్టకాలంలో 220 కోట్ల టీకాలు ఫ్రీగా ఇచ్చి మన ప్రాణాలు కాపాడాడు
జాతీయ రహదారులు
బుల్లెట్ ట్రైన్స్
భారత దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీసుకొచ్చిన ఘనుడు నరేంద్ర మోడీ జీ గారూ భువనగిరి పార్లమెంట్ కి జాతీయరహదారులు, బీబీనగర్ AIIMS,MMTS ట్రైన్ , కేంద్రీయవిద్యాలయం, ముద్రలోనులు 14th&15th ఫైనాన్స్ ద్వారా మన గ్రామ పంచాయతీ నిధులు,ఉచిత రేషన్,మిషన్ ఇంద్ర ధనుస్సు, స్వచ్ఛభారత్ మొదలైనటువంటి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కాబట్టి బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుకున్నారు....
ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ మంత్రులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న టీయూటీఎఫ్ రఘునందన్ రెడ్డి

### 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి ...టీయూటీఎఫ్

**హైదరాబాద్ వెలుతురు మార్చి 14:**
317 జీవో ద్వారా అలోకేట్ అయి వయోవృద్ధులైన తల్లిదండ్రులను వదిలి,స్థానికతను కోల్పోయి పక్క జిల్లాల్లో కుటుంబాలకు దూరంగా స్థానికేతరులుగా పని చేస్తున్న 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తరపున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాటిమీది రఘునందన్ రెడ్డి జీవో 317 పరిష్కారాల కొరకు ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ మంత్రులు గౌరవ దామోదర రాజనర్సింహ,దుద్దిళ్ల శ్రీధర్ బాబు గార్లకు వినతిపత్రాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా నష్టపోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు రీఅలకేట్ చేయాలని 317 బాధిత ఉపాధ్యాయులందరిననీ గుర్తించి వారు ఏ జిల్లా స్థానికులో ఆయా జిల్లాలకు రీఅలకేట్ చేయాలని,రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 లో నిర్వచించిన ప్రకారం స్థానికతను నిర్ధారించాలని,317 జీవో ప్రకారం స్థానిక జిల్లాలకు అలకేట్ కానీ ఉపాధ్యాయులందరినీ సర్వీస్ సీనియార్టీ ప్రకారం తిరిగి ఆప్షన్లను కేటాయించాలని,ప్రస్తుతం ఉన్న ఖాళీలలో లేదా రిటైర్మెంట్ ల ద్వారా ఏర్పడుతున్న ఖాళీలలో ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు సర్దుబాటు చేయాలని, అవసరమైతే సూపర్ న్యూమరరీ పోస్టులు క్రియేట్ చేసి వారిని సొంత జిల్లాలకు కేటాయించాలని, రివర్స్ స్పౌజ్ కు మరొకసారి అవకాశం కల్పిస్తే కొంతవరకు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని,అదేవిధంగా ఉమ్మడి జిల్లాల వారీగా పదోన్నతులు,బదిలీలు కల్పిస్తే కూడా కొంతమంది స్థానిక జిల్లాలకు చేరుకునే అవకాశం ఉంటుందని అంతేకాకుండా అంతర్రాష్ట్ర బదిలీలకు అనుమతిస్తే ఈ విధంగా కూడా కొన్ని ఖాళీలు ఏర్పడతాయని తద్వారా ఆయా ఖాళీలకు స్థానిక ఉపాధ్యాయులను బదిలీ చేసే అవకాశం కలుగుతుందని అంతేకాకుండా జీవో 317 అలకేషన్ సందర్భంగా అక్రమాలకు పాల్పడిన అధికారులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.





# బండి సంజయ్ గెలిస్తే మోదీ కేబినెట్‌లో మంత్రి కావడం తథ్యం

### దుబ్బాకలో పోరాడి గెలిపించిన నాయకుడు బండి సంజయ్

### బీఆర్ఎస్ ను కూడా ఓడించవచ్చని నిరూపించిన తొలి ఎన్నిక దుబ్బాక

### సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత నిజమో... మోదీ మళ్లీ పీఎం కావడం అంతే నిజం

### బండి సంజయ్ రాష్ట్రమంతా ప్రచారం చేయాలి

### మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎన్.రఘునందన్ రావు

**బోయినిపల్లి మండలం వెలుతురు మార్చి 14:**
బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే నరేంద్రమోదీ కేబినెట్ లో మంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎన్.రఘునందన్ రావు అన్నారు. రాష్ట్రంలో ఎదురే లేదని విర్రవీగుతున్న బీఆర్ఎస్ ను కూడా ఓడించవచ్చని నిరూపించి వచ్చిన తొలి ఎన్నిక దుబ్బాక అని పేర్కొన్నారు. ఆ ఎన్నికల్లో తాను అభ్యర్థిగా నిలబడితే పోరాడి గెలిపించిన నాయకుడు బండి సంజయ్ అని పేర్కొన్నారు. సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత నిజమో... కేంద్రంలో మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని కావడం అంతే నిజమని అన్నారు. రఘునందన్ రావును మెదక్ బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో చొప్పదండి నియోజకవర్గంలోని బోయినిపల్లి మండలంలో ప్రజాహిత యాత్ర చేస్తున్న బండి సంజయ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోయినిపల్లి మండల కేంద్రంలో భారీ ఎత్తున ప్రజలు తరలిరావడంతో బండి సంజయ్ తో కలిసి రఘునందన్ రావు ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా బండి సంజయ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. 6 గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ దేశానికి దిక్సూచి మోదీ అని కొనియాడారు. కరోనా సమయంలో ఉచితంగా వ్యాక్సిన్ అందించి దేశ ప్రజల ప్రాణాలను కాపాడారన్నారు...








## వెలిమెల గ్రామంలో శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి వారి బ్రహ్మోత్సవం

### దర్శించుకున్న పటాన్ చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి : కాట శ్రీనివాస్ గౌడ్

**తెల్లాపూర్ వెలుతురు మార్చి 14:**
తెల్లాపూర్ మున్సిపాలిటీ వెలిమెల గ్రామంలో శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవం వేడుకలు ఘనంగా సాగాయి. ఈ ఉత్సవంలో పటాన్ చెరు నియోజకవర్గం



కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ గారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్ గౌడ్ గారిని ఘనంగా సన్మానించారు.

## వటపత్రశాయిగా దర్శనమిచ్చిన స్వామి

**యాదాద్రిభువనగిరి,మార్చి14(వెలుతురు):** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. గురువారం ఉదయం వట పత్రశాయి అలంకార సేవలో లక్ష్మీనరసింహ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 7.00 గంటలకు హంస వాహన అలంకార సేవ కొనసాగనున్నది. కాగా, ఆలయ మహా ఉద్ఘాటన తర్వాత రెండోసారి బ్రహోత్సవాలు జరుగుతుండగా, ఈ నెల 21 వేడుకలు కొనసాగనున్నాయి.

## రుద్రూరు ఎటిఎంలో చోరీ

### 25 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

**నిజామాబాద్,మార్చి14(వెలుతురు):** నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో భారీ చోరీ జరిగింది. బస్టాండ్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేసిన గుర్తుతెలియని దుండగులు.. రూ.25 లక్షలు దోచుకెళ్లారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బొలెరో వాహనంలో వచ్చిన నలుగురు దుండగులు.. ముసుగులు ధరించి వచ్చారు. తమ ఫుటేజ్ రికార్డు కాకుండా ఇరువైపులా ఉన్న సీసీ కెమెరాలపై స్ప్రే చేశారు. అనంతరం ఏటీఎంను ధ్వంసం చేసి రూ.25 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. మెషిన్ విడిభాగాలను బయట
పడేశారు. సమాచారం అందుకున్న రుద్రూర్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించారు. ఈ చోరీపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నష్టాల నుంచి కోలుకున్న సూచీలు

**ముంబయి,మార్చి14(వెలుతురు):** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం నాటి భారీ నష్టాల నుంచి కోలుకున్నాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైనప్పటికీ.. గురువారం నాటి ట్రేడింగ్ సెషన్ లాభాల్లో ముగిశాయి. ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. వరుస నష్టాలు ఎదుర్కొంటున్న స్మాల్ క్యాప్ (3 శాతం), మిడ్ క్యాప్ సూచీలు (2 శాతం) రాణించాయి. అదానీ గ్రూప్ స్టాక్స్ సైతం ఇవాళ లాభపడ్డాయి. అదానీ ఎనర్జీ 10 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 10 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 11 శాతం చొప్పున లాభపడ్డాయి. ఉదయం సెన్సెక్స్ 72,570.10 వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే కొనుగోళ్ల మద్దతుతో కోలుకుంది. ఇంట్రాడేలో 73,364.30 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 335.39 పాయింట్ల లాభంతో 73,097.28 వద్ద ముగిసింది. నిఫ్టీ 148.95 పాయింట్ల లాభంతో 22,146.65 వద్ద స్థిరపడింది.





# ఈటలకి మద్దతు ప్రకటించిన పలు సంఘాలు

### వారికి కృతజ్ఞతలు తెలిపిన ఈటల రాజేందర్.

**వెలుతురు ఉప్పల్ నియోజకవర్గం మార్చి 14:**
ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం మల్కాజ్గిరి కి వస్తున్నారు మీరంతా వచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనే నినాదం ఇవ్వడమే కాదు ఆచరించి చూపించిన నాయకుడు మోదీ.
కరోనా సమయంలో మొట్టమొదటి పేషంట్ దగ్గరికి వెళ్ళి ధైర్యం చెప్పిన మొదటి మంత్రిని నేను.
దేశ ప్రజలకు ధైర్యాన్ని అందించిన నాయకుడు నరేంద్ర మోడీ.ప్రపంచానికి వాక్సిన్ అందించారు.
ప్రపంచంలో భారత కీర్తి పెంచిన నాయకుడు మోదీ.ఏ దేశంకి వెళ్ళినా ఈనాడు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు.
అమెరికాలో డిజిటల్ ట్రంజక్షన్ రావడానికి పదేళ్లు పట్టింది కానే చదువురాని వారు ఉన్న మనదేశంలో మూడెల్లే పట్టింది.
రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కళ్ళు నెత్తికి ఎక్కిన సీఎం కెసిఆర్ తో కూడా కొట్లడింది నేనే. నేనేంటో మీ అందరికీ తెలుసు.
నేను చాలా అదృష్టవంతున్నీ.. తెలంగాణ ప్రజల అందరి ఆశీర్వాదం ఉన్నవాన్ని. మల్కాజిగిరి లో తెలంగాణ అన్ని జిల్లాల ప్రజలు ఉంటున్నారు. హుజురాబాద్ లో మొన్న ఎన్నికల ప్రచారానికి పోలేక పోయిన. మా వాళ్ళను నమ్మిన కానీ ఆగం పట్టించారు. ఈ సీఎంకి కూడా కళ్ళు నెత్తికి ఎక్కాయి.
అధికారం ఉందని ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. మల్కాజిగిరి కి నాకు ఏం సంబంధం అని అడుగుతున్నారు. నేను పొత్తుల సద్దిని. 2010 ఎన్నికలో మా ఓటు ఈటలకే మిగతా పార్టీల వారు మా ఊరికి రావద్దు అని హుజురాబాద్ నియోజకవర్గం మాచనపల్లి లో బ్యానర్ కట్టారు. ఇప్పుడు కూడా ఏకగ్రీవ తీర్మానం చేస్తున్న మీ అందరికీ ధన్యవాదములు. మళ్ళీ డబ్బుల సంచులతో వస్తారు. అప్రమత్తంగా ఉండండి. మీ ఆత్మను అమ్ముకోవద్దు. నేను 36



లక్షల ఓటర్లను కలవడం సాధ్యం కాదు. మీరే కథానాయకులు కావాలి. ఇది మీ ఎన్నిక అని కొట్లడాలి అని విజ్ఞప్తి చేస్తున్నాను. నన్ను నిండుమనసుతో ఆశీర్వదించండి.

# టమాట ధరలతో రైతుల విలవిల

### దిగుమతులతో తగ్గుతన్న ధరలు

**రంగారెడ్డి,మార్చి14(వెలుతురు):** టమాటా ధరలు అమాంతం పడిపోవడంతో పంటపండించిన రైతులు నేలచూపులు చూస్తున్నారు. ఏటా వేసవి సీజన్‌లో ధరలు మండిపోగా ఇప్పుడు మాత్రం గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. పంట దిగుబడులుపెరగడంతో ధరలు అమాంతంగా పడిపోయాయి. రిటైల్ ధరలు కిలోకి 10 నుంచి 20 మధ్యన అమ్మాల్సి వస్తోంది. నెల రోజుల క్రితం వరకు కిలో రూ.30 రూ.50 వరకు ధర పలికిన టమాట తమ దిగుబడి చేతికి పంట వచ్చే సరికి రూ. ధరలు పెద్దగా పలకడం లేదు. దీంతో పెట్టుబడి, కూలీ,రవాణా చార్జీలు కూడా గిట్టుబాటుకాని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. సాగుచేసిన రైతులకు పడిపోయిన ధరలు అప్పులే మిగులుస్తున్నాయి. . రోజురోజుకు పడిపోతున్న ధరలను చూసి రైతన్నలు దిగాలు పడుతున్నారు. పండించిన పంట గిట్టుబాటు లేక పెట్టుబడి అప్పులు తీర్చేదెలా.. అన్న అయోమయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్ నగర శివారు జిల్లాలో సంప్రదాయ పంటలతో పాటు కూరగాయల సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో ఉద్యానవన, కూరగాయల సాగు కలిపి వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రతి ఎకరానికి రూ. 40 నుంచి 50వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఈ టమాటను స్థానిక అవసరాలకు ఆయా పట్టణాలతో పాటు హైదరాబాద్ నగరంలోని బోయిన్‌పల్లి ఇతర కూరగాయ హోల్‌సేల్ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. రాష్ట్రంలో ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి టమాటా దిగుమతి పెరగడం రైతుల పాలిట శాపంగా మారింది. స్థానికంగా టమాట సాగు చేసినప్పుడు, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయితే ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. స్థానికంగా పంటల సాగు తక్కువగా ఉన్నప్పుడు హోల్‌సేల్‌గా దాదాపు కిలో రూ.50 ధర పలికేది. అయితే ప్రస్తుతం స్థానికంగా రైతులు టమాట సాగు ఎక్కువ చేయగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి దిగుమతులు పెరుగుతున్నాయి. దీంతో ధరలపై ప్రభావం చూపి నేలచూపులు చూస్తున్నాయి. కూరగాయల సాగును ప్రోత్సహిస్తామని చెబుతున్న ప్రభుత్వం గతంలో సబ్సిడీ విత్తనాలు, ఇతర సదుపాయాలకు కోత పెట్టింది. కనీసం స్థానిక కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఇతర రాష్ట్రాలనుంచి దిగుమతులపై ఆంక్షలు పెట్టి ఆదుకోవాలని కోరుతున్నారు.



# బ్లాక్ ఎందుకు ధరించాలి?..

## ఫ్యాషన్‌లో అశుభమన్న మాటకు తావులేదంటున్న డిజైనర్లు
## ధరించడంలో కాస్త మెలకువ పాటిస్తే మీరే ఫ్యాషన్ ఐకాన్ అంటూ సూచన

బ్లాక్ (నలుపు) అశుభానికి చిహ్నంగా భావించే వారెందరో.. ఫ్యాషన్ ప్రియులు మాత్రం ఎవర్‌గ్రీన్ కలర్స్‌లో ఒకటిగా దీనికి ప్రత్యేక స్థానమే ఇస్తుంటారు. ఈ కలర్ ఎలాంటి వారికైనా కొత్తందాలను అందిస్తుందన్నది డిజైనర్ల మాట. క్యాజువల్ మొదలు పార్టీ డ్రెస్సింగ్, వెడ్డింగ్స్‌లో అక్కడక్కడా ఈ నలుపందాలు కనిపిస్తుంటాయి.

**హైదరాబాద్:** అంతర్జాతీయ ధోరణుల కారణంగా ఫ్యాషన్‌లో తప్పనిసరి రంగుగా బ్లాక్ చేరింది. వేడుకలలో బ్లాక్‌కు అసలు స్థానం లేదన్నది సత్యం కానీ పలువురు సినీతారలు మొదలుకుని సోషలైట్స్ వరకూ వేడుకలు, సంప్రదాయ పండుగలలో ఆ రంగు వస్త్రాలను సౌకర్యవంతంగా ధరిస్తున్నారు. ఎందుకలా అని అంటే, బ్లాక్ డ్రెస్‌కు డిజైన్ పరంగా పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదు. పైగా కాంబినేషన్‌గా బ్లాక్ చాలా వరకూ కలర్స్‌తో సులువుగా కలిసిపోతుంది. బ్లాక్ డ్రెస్‌పై కొద్దిగా ఎంబ్రాయిడరీ వర్క్ చేసినా చాలు.. అందంగా కనిపిస్తుంది... పైగా పదిమందిలో సైతం ప్రత్యేకంగా కనిపించవచ్చు. ఈ కారణాలే బ్లాక్‌ను ఇప్పుడు అభిమాన కలర్‌గా మారుస్తున్నాయని డిజైనర్ హరీష్ అన్నారు.

### బ్లాక్ ఎందుకు ధరించాలంటే..

ఫ్యాషన్‌లో రంగులకు ఓ గుర్తింపు ఉంది. నమ్మకాల పరంగానూ వీటికి అధికప్రాధాన్యతే ఉంది. బ్రౌన్ కలర్ నమ్మకానికి ప్రతీకగా, ఎర్తీ కలర్‌గా చెబితే, వైట్‌ను శుభ్రతకు ప్రతీకగా చెబుతారు. కానీ బ్లాక్‌కు అలాంటి గుర్తింపేమీ లేదు. అయినప్పటికీ దీనికి ఫ్యాషన్‌లో ప్రత్యేకస్థానముంది. ఎందుకూ అంటే ఇది మీ మొహం మీద మాత్రమే ఎదుటి వారి చూపు పడేలా చేస్తుందంటున్నారు డిజైనర్లు. మరీముఖ్యంగా సినీతారలు, బిజినెస్ టైకూన్స్ ప్రత్యేక సందర్భాలలో బ్లాక్ ధరించడానికి కారణమిదే అని కూడా చెబుతున్నారు. ఇదే విషయమ్మై డిజైనర్ అర్షియా మాట్లాడుతూ బ్లాక్ ధరించడానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. దాదాపుగా అన్ని రంగులతోనూ ఇది బాగుంటుంది. ఎలాంటి స్కిన్‌టోన్‌పై అయినా ఇది బాగుంటుంది. సీజన్‌లతో సంబంధం ఉండదు సరికదా ఎలాంటి యాక్ససరీస్ ధరించినా అవి మరింతగా అందంగా కనబడతాయి.. అనిఅన్నారు.

### బ్లాక్ షర్ట్ ఎలా ధరించాలంటే..

బ్లాక్ షర్ట్‌ను ఎలా పడితే అలా ధరించొచ్చు అనుకుంటే పొరబడినట్లే అని అంటున్నారు హరీష్. కొద్దిపాటి మెలకువలు పాటించాల్సిందేనని ఆయన చెబుతూ పలు సూచనలు చేశారు. అవేమిటంటే..

- ప్రతిరోజూ ఉద్యోగానికి వెళ్తూ వైట్స్ లేదంటే పేస్టల్ కలర్స్.. వాటికి కాంబినేషన్స్ ఎంచుకోవడం కష్టమనుకుంటే సింపుల్‌గా బ్లాక్ షర్ట్ ధరించొచ్చు. కాకపోతే మనం చేసే ఉద్యోగం కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఐటీ రంగంలో ఇది పెద్ద ఇబ్బంది కాకపోవచ్చు. అలాగని బ్లాక్ షర్ట్, నేవీబ్లూ ట్రౌజర్స్ ధరిస్తే కౌబాయ్‌లా ఉంటారు.
- బ్లాక్ కాంబినేషన్‌గా థిక్ కలర్స్ ఉంటే బాగుంటుంది. అదీ ఫుల్ బ్లాక్ అయితే మీ సహచరులు మీపై అధిక శ్రద్ధ చూపేందుకు ఎక్కువ అవకాశముంటుంది. ఔట్‌ఫిట్ ఎప్పుడూ కూడా సింపుల్‌గా ఉండాలి.
- చాలామంది బ్లాక్ షర్ట్ ధరించి జీన్స్ ఫ్యాంట్ వేస్తారు. క్యాజువల్ డిజైన్‌గా బాగానేఉంటుంది కానీ అన్ని సందర్భాలలోనూ ఇది బాగోదు. అలాకాకుండా ఉండాలంటే స్కిన్నీ జీన్స్‌తో ధరిస్తే బెటర్. స్కిన్నీ జీన్స్‌మనకు పడదనుకుంటే స్లిమ్ ఫిట్టింగ్ చినోస్ అయినా బాగానే ఉంటాయి. ఇంకాస్త వెరైటీ చూపాలనుకుంటే రిప్డ్ జీన్స్ కూడా ధరించొచ్చు.
- ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యాజువల్ లుక్ చూపాలనుకుంటే, కాంట్రాస్టింగ్ కలర్‌లో టీషర్ట్ వేస్తే చాలు. రిలాక్సింగ్, క్యాజువల్ ఔట్‌లుక్ కావాలనుకుంటే బ్లాక్ హుడీనీ బ్లాక్ జీన్స్‌తో ధరించొచ్చు.
- బ్లాక్ షర్ట్‌ను గ్రే ప్యాంట్స్‌తో ధరిస్తే క్లాసిక్ లుక్ ఇవ్వొచ్చు. మొత్తం బ్లాక్ కూడా మంచి ఆలోచన కానీ అది సూట్స్‌తో అయితే ఎదుటి వారిని ఇంప్రెస్ చేయొచ్చు.
- ఒన్లీ బ్లాక్ కష్టం.... ఇంకాస్త వెరైటీ కావాలనుకుంటే, బ్లాక్ చెక్స్ షర్ట్ ధరించొచ్చు. ఈ తరహా షర్ట్స్ ధరించినప్పుడు బ్లాక్ స్కిన్నీ జీన్స్ ధరిస్తే క్యాజువల్ ఔట్‌ఫిట్ ధరించిన అనుభూతి పొందొచ్చు.
- మన వాతావరణానికి పూర్తి అనువైన బ్లాక్ షర్ట్ అంటే షార్ట్ స్లీవ్ షర్ట్. కాకపోతే ఈవెనింగ్ వేర్‌గా మాత్రమే వీటిని ట్రై చేయాల్సి ఉంటుంది.
- బైకర్స్ కాస్త వెరైటీ ట్రై చేయాలనుకుంటే బ్లాక్ షర్ట్‌ను లెదర్ జాకెట్‌తో కలిపి ధరించొచ్చు. స్మార్ట్‌గా, కాంట్రాస్ట్‌గా ఇది ఉంటుంది. ఈ తరహా షర్ట్స్ వేసినప్పుడు ఫేడెడ్ బ్లాక్ జీన్స్, చంకీ బూట్స్ వాడాలి.
- కాలేజీ విద్యార్థులు బ్లాక్ షర్ట్స్ ధరించాలనుకుంటే పోలో షర్ట్స్ ధరించొచ్చు. అదే వర్క్‌వుట్స్‌కు వెళ్లేవారు ఆలివ్ గ్రీన్ జాగర్ ప్యాంట్స్‌తో పాటుగా బ్లాక్ టీ షర్ట్ ధరించొచ్చు.



# శ్వేత సోయగాలు

తెలుపు రంగును ఫ్యాషన్ డిజైనర్లు తెగ ప్రేమించేస్తారు తెలుసా. ఈ ప్రేమకు సరైన పోలిక... చిత్రకారులు. అదెలాగంటే ఖాళీ కాన్వాస్ మీద రంగులద్దేందుకు చిత్రకారులు ఎంతగా తపించిపోతారో అంతగా ఫ్యాషన్ డిజైనర్లు తెలుపు రంగును ప్రేమిస్తారన్నమాట. తెలుపురంగు మిగతా ఏ రంగులతో జతకట్టినా అందంగా కనిపించడమే ఇందుకు కారణం. ముత్యంలా మెరిసిపోయే స్వచ్ఛమైన తెలుపు రంగుకు గులాబీ రంగు అద్దితే యువతుల చెక్కిళ్లు తలపుకొస్తాయి. ఎరుపు రంగు అద్దితే నుదిటిమీద కుంకుమ నాట్యమాడుతున్నట్టు ఉంటుంది. పసుపు రంగు అద్దితే ఇంటి వాకిలి గడప ఆనందాల స్వాగతాలు పలికినట్టే అనిపిస్తుంది. అదే ఆకుపచ్చ రంగుతో కలిస్తే ప్రకృతి ఒడిలో సేదతీరిన భావనే కలుగుతుంది. ఇలా తెలుపు రంగును ఏ రంగుతో జత చేర్చినా మనసుకు హాయైన భావనలు కలగడం ఖాయం. ఒక్క మాటలో చెప్పాలంటే మనసు పలికే తెలుపు భావనలు ఎంతో అపురూపం. ఈ మధ్య జరిగిన ఒక పరిశోధన కూడా కాస్త అటుఇటుగా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది.

తెలుపు రంగు వస్త్రాలు ధరిస్తే నిరాశా పూరిత భావాలు తగ్గుతాయనేది ఆ పరిశోధనా సారాంశం. మనసుకు హాయి కలిగించే మంత్రదండం తెలుపు రంగును ఆప్యాయంగా కౌగిలించుకోవడమే ఆలస్యం.



# ఎరుపు మెరుపు

బోల్డ్ ఈజ్ బ్యూటిఫుల్! అది రంగులకూ వర్తిస్తుంది. కాబట్టే ముదురు రంగులు ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మారాయి. మరీ ముఖ్యంగా ఎరుపు రంగు లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్! కాబట్టి రౌడీ రెడ్ స్టయిల్స్ ఫాలో అయిపోదాం!

### రెడ్ స్పెక్స్

కళ్లజోడు ఫ్రేములు ఇప్పుడు ఎన్నో రకాల్లో దొరుకుతున్నాయి. వీటిలో ఎరుపు రంగువి ఎంచుకుంటే అందర్లోకి ప్రత్యేకంగా కనిపిస్తాం! ఎరుపు రంగు ఎంత దూరం నుంచి అయినా కళ్లను ఆకర్షిస్తుంది కాబట్టి కళ్లజోడు మిస్ కాదు.

### లిప్‌స్టిక్

లేలేత పెదవులకు ఎర్రరంగు లిప్‌స్టిక్ మరింత అందాన్నిస్తుంది. అందులోనూ మాట్ టైప్ రెడ్ లిప్‌స్టిక్స్, నెయిల్ పాలిష్‌లు వేస్తే కిల్లింగ్ స్టయిల్!




### యాక్సెసరీస్

గొడుగు నల్లగానే ఎందుకుండాలి?

ఎరుపుది ఎంచుకుంటే అదొక ఆకర్షణ.

### రెడ్ షూస్

అట్టైర్‌లో ఆటిట్యూడ్ కనిపించాలంటే ఎరుపును జోడించాలి. కాంట్రాస్ట్‌గా రెడ్ కలర్ షూ, బ్యాగ్ మ్యాచ్ చేస్తే అదిరిపోతుంది.

### రెడ్ ఫ్రాక్

ఫ్రాకులు ఎరుపువైతే ఆ ఆకర్షణే వేరు. నలుగురిలో నదురుగా కనిపించాలనుకుంటే మోకాళ్ల వరకూ ఉండే రెడ్ ఫ్రాక్ ఎంచుకోవాలి. లాంగ్‌ఫ్రాక్‌ల స్టయిల్ కూడా బాగుంటుంది. అయితే వీటికి మ్యాచింగ్ నెయిల్ పాలిష్, ఐ షాడో తప్పనిసరి.





# సమ్మర్ స్టయిల్

**హ్యాట్స్**, గాగుల్స్ పెట్టుకుని సమ్మర్ ఫ్యాషన్‌కి షిఫ్ట్ అయిపోతారు చాలామంది అమ్మాయిలు. అంతవరకు ఓకే కాని సమ్మర్‌లో సింపుల్‌గా, స్టయిలిష్‌గా కనిపించాలంటే ఏం చేయాలి... అదింకా సింపుల్. ఈ ఫోటోల్లో కనిపిస్తున్న అమ్మాయికి మల్లే రెడీ అయిపోవాలి. క్యాప్రిలు, ట్రౌజర్స్... ఏవి వేసుకున్నా వాటిపై టీషర్ట్ వేసుకోవాలి. జుట్టు మెడ మీద పడి చిరాకు పెట్టకుండా తలకి ఒక పక్కగా హెయిర్ బ్యాండ్ పెట్టేయాలి. ఒకవేళ ఈ హెయిర్‌స్టయిల్ నచ్చకపోతే జుట్టు ముఖం మీదకి పడకుండా హ్యాట్‌తో మేనేజ్ చేసేయొచ్చు. ఈ డ్రస్సింగ్‌తో హాట్‌హాట్ సమ్మర్‌లో మరింత హాట్‌గా కనిపించడం ఖాయం.

# వన్ గ్రామ్ గోల్డ్ జువెలరీ...

వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ... ఒకప్పుడు దిగువ మధ్యతరగతి ప్రజలకు మాత్రమే పరిమితమైన ఈ ఆభరణాలు ఇప్పుడు సంపన్న వర్గాల మహిళలను కూడా ఆకర్షిస్తున్నాయి. పార్టీలు, వేడుకల్లో అతివలు వీటినే వినియోగిస్తున్నారిప్పుడు. బంగారం ధరలు రోజూ రికార్డులను తాకుతున్నాయి. దీపావళి నాటికి 30 వేల రూపాయల మార్క్‌కు 10 గ్రాముల బంగారం చేరిపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న ధరలు ఒకవైపు ఆందోళన కలిగిస్తుంటే.. మరోవైపు చైన్ స్నాచర్‌లు, దొంగల భయం. బయటకు వెళ్లిన వారు మంగళ సూత్రాలతో సహా అయినా సురక్షితంగా ఇంటికి వస్తారన్న గ్యారంటీ లేదు.

ప్రతి రోజూ చైన్ స్నాచర్ల విజృంభణ చూస్తూనే ఉన్నాం. ఈ భయాలకు చెక్ పెడుతూనే అతివలకు కావాల్సిన డిజైన్స్‌లో లభిస్తూ స్టైలిష్‌గా మార్కెట్‌ను ఆక్రమిస్తున్నాయి వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు.యాంటిక్ నుండి స్లిమ్ ఫిట్ జువెలరీ వరకూ వేలాది మోడల్స్ వస్తున్నాయి. ఇక సినిమా, టీవీ సీరియల్స్‌లో ఓ ఆభరణం కనిపించింది అని అంటే.. మరుసటి రోజుకు ఆ ఆభరణం ప్రత్యక్షమవటం కూడా నగరంలో కనిపిస్తోన్న నయా ట్రెండ్.

### బంగారానికి ప్రత్యామ్నాయం...

సప్లయ్ తక్కువ కావడం.. డిమాండ్ పెరగడం.. ప్రభుత్వాలు విధించే పన్నులు.. వెరసి పసిడి ధరలు ఆకాశంలో పయణించడం మొదలుపెట్టాయి. మరి ప్రత్యామ్నాయం ఏమిటి..? ఆ ఆలోచనలో నుండి పుట్టుకు వచ్చిందే వన్ గ్రామ్ గోల్డ్. మెడలో వీసమెత్తు బంగారం లేకుండానా అనే వారు కూడా ఇప్పుడు ఈ వన్‌గ్రామ్ జువెలరీ మెరుపుల పట్ల ఆకర్షితులవుతున్నారు. దీనికి తోడు ఫ్యాషన్‌ల పట్ల మోజు ఎలాగూ ఉంది. తమ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే రీతిలో ఆభరణాలు ఉండాలని కోరుకుంటోన్న మహిళలు పెరిగారు. ఇటీవలి కాలంలో అతి ఎక్కువగా కనిపిస్తోన్న ట్రెండ్ నల్లపూసలు (బ్లాక్ బీడ్స్) ను కూడా వన్‌గ్రామ్ గోల్డ్‌తో చేసినవే వాడుతుండటం. దాదాపు 100కు పైగా డిజైన్స్ ఈ నల్లపూసల్లో లభిస్తున్నాయిప్పుడు. ఆఫీస్‌వేర్ కలెక్షన్‌గా ఎక్కువమంది అతివలు ఇష్టపడుతున్న పెండెంట్, ఇయర్ రింగ్స్, చైన్‌లు కూడా ఎన్నో వెరైటీల్లో లభిస్తున్నాయి. వన్‌గ్రామ్ గోల్డ్‌కు ఇటీవలి కాలంలో విపరీతమైన ఆదరణ లభిస్తోందంటున్నారు చిరాగ్ అలీ లేన్‌లోని సాయి పెరల్స్ అండ్ గిఫ్ట్స్ అధినేత రమేష్‌కుమార్.



సరిగ్గా చెప్పాలంటే పది పన్నెండేళ్ల నుంచీ వీటిని ఆదరిస్తున్నారు కానీ ఇటీవలికాలంలో డిమాండ్ పెరిగింది. కేవలం 100 రూపాయల నుంచే వీటి ధరలు ఉండటం.. గరిష్టంగా 25 వేల రూపాయలకు తల నుంచి పాదాల వరకూ కావాల్సిన జ్యుయెలరీ మొత్తం వైవిధ్యమైన డిజైన్లలో లభించటం.. వీటికి తోడు కనీసం ఆరు నెలల వారెంటీ... ఇవన్నీ ఇటు వైపు మహిళలు దృష్టి సారించేలా చేసున్నాయంటున్నారు. అందుకే ఒకప్పుడు చిరాగ్ అలీ లేన్ లాంటి ప్రాంతాల్లో మాత్రమే కనిపించే ఈ ఆభరణాలు ఇప్పుడు ఫ్యాన్సీ షాపుల్లో కూడా కనిపిస్తున్నాయి. అయితే వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలను మాత్రమే అమ్మే షాప్‌లు హైదరాబాద్, సికిందరాబాద్‌లలోనే దాదాపు 500 వరకూ ఉన్నాయి. ఆబిడ్స్‌లోని చిరాగ్ అలీలేన్‌లోనే కనీసం 30 వరకూ ఈ తరహా ఆభరణాల షాపులు దర్శనమిస్తుండటం విశేషం.

### జాగ్రత్తలు తప్పనిసరి..

సాధారణంగా ఈ జువెలరీ ఓ సంవత్సరం పాటు అందాలను చిందిస్తాయి కానీ.. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే 10 సంవత్సరాలు కూడా పాడవకుండా ఉంటాయి. అలా ఎక్కువ కాలం మన్నాలంటే ఇలా చేయాల్సిందే అంటూ కొన్ని సూచనలు చేస్తున్నారు..

1 పాలిథిన్ కవర్ లేదా ప్లాస్టిక్ బాక్స్‌లలోనే వీటిని భద్రపరచాలి

2 ఆభరణాలను ధరించిన తరువాత పెర్ఫ్యూమ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ స్ప్రే చేయకూడదు.

3 స్నానం చేసేటప్పుడు ఈ ఆభరణాలను ధరించకూడదు. సబ్బు నీళ్లు తగిలితే త్వరగా పాడయ్యే అవకాశం ఉందట.


4 అతి ఎక్కువ వేడి ఉన్న ప్రాంతాల్లో ఈ జువెలరీ వాడకపోవడం మంచిది. ఎక్కువ వేడి శరీరం తత్త్వం కలిగిన వాళ్లు ఈ తరహా జువెలరీ జోలికి వెళ్లకపోవడమే ఉత్తమం.

## భోజనం చేసిన వెంటనే మాత్రలు వేసుకుంటున్నారా..

# అయితే ఇది మీకోసమే..



ముఖ్యంగా చెప్పాలంటే చాలా మంది ప్రజలు తెలిసో తెలియకో చిన్న చిన్న తప్పులను చేస్తూ ఉంటారు. కానీ వాటి వల్ల పెద్ద సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందులో ముఖ్యమైనది తిన్న వెంటనే మాత్రలు వేసుకోవడం( %ఝుఎఅఅస్త్ర వీవఎఅఎఅవ-ాట్వతీ ఖీశీశీ౯% ). ఇది చాలా చెడ్డ అలవాటు అని నిపుణులు చెబుతున్నారు. సరైన అవగాహన లేక ఇలా చేస్తూ ఉంటారు.ఈ ఆధునిక యుగంలో కూడా చాలా మందికి సరైన మాత్రలు తీసుకోవడం పై అవగాహన లేదు. ఇది వివిధ ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుంది. ప్రస్తుతం చాలా మంది ప్రజలు మాత్రల దుర్వినియోగానికి గురవుతున్నారని ఒక పరిశోధనలో తెలిసింది.అటువంటి ప్రమాదాలను సమర్థవంతంగా తగ్గించడానికి మాత్రలు తీసుకోనే సరైన పద్ధతులను తెలుసుకోవడం ఎంతో అవసరం. అనేక వ్యాధుల నివారణ కు ఉపయోగించే మాత్రలను ఎప్పుడూ కూడా చాలా రకాలుగా కలిపి తీసుకోకూడదు. దురదృష్టవశాత్తు కొందరు వ్యక్తులు ఒకే సమయంలో వేరు వేరు మాత్రలు తీసుకుంటూ ఉంటారు. ఈ మాత్రల ప్రయోజనాలను పూర్తిగా గ్రహించే సామర్థ్యం శరీరం కోల్పోతుంది. సామర్థ్యాన్ని అడ్డుకుంటారో ఇది ఔషధ ప్రభావాన్ని తగ్గించడమే కాకుండా దీర్ఘకాలిక దుష్ప్రభావాలను అనుభవించే అవకాశాన్ని పెంచుతుంది. ఏదైనా రోగానికి మాత్రమే వేసుకుంటే ఇంకో మాత్ర వేసుకునే వరకు కాస్త సమయం వేచి ఉండాలి. సాధారణంగా మనలో చాలా మందికి తగిన అవగాహన లేక ఆరోగ్య నిపుణులతో సంప్రదింపులు లేకుండా ఫార్మసీల నుంచి ఈ మందులు తీసుకునే అలవాటు ఎక్కువగా ఉంటుంది. వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుని సరైన ప్రిస్క్రిప్షన్ తో మాత్రమే మెడిసన్ తీసుకోవాలి.



ఉదాహరణకు చాలా మంది గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతూ ఉంటారు.

కానీ దానిని గ్యాస్ ప్రాబ్లంగా( +ఝం ౖాతీశీఎశ్రీవఎ ) భావించి ఆ మాత్రలు తీసుకుంటూ ఉంటారు. ఇలాంటి చర్యలు ప్రాణాల మీదకు వస్తాయి. అలాగే మాత్రలు వేసుకునే విధానం కూడా ఎంతో ముఖ్యం. భోజనం తర్వాత వెంటనే మాత్రలు తీసుకోవడం ప్రతికూల దృశ్య ప్రభావాలను కలిగిస్తుంది. పోషకాల శోషణను నిరోధించవచ్చు. మాత్రలు తీసుకోవడానికి సరైన సమయం చూసుకోవాలి. భోజనం చేసిన వెంటనే మాత్రలు వేసుకోకూడదు. భోజనం చేసిన 15 నుంచి 20 నిమిషాల వరకు వేసి ఉన్నప్పుడు మాత్రమే వేసుకోవాలి.

# పిల్లల్లో వస్తున్న జ్వరానికి కారణం ఇదేనట

ఈ మధ్య కాలంలో ఎక్కువగా బ్యాక్టీరియాలతో వచ్చే జ్వరం వస్తుంది . ఇది చిన్న పిల్లలలో ఎక్కువగా కనబడుతుంది . గత రెండు, మూడు నెలలుగా వచ్చే ఈ ఫీవర్ ను స్కార్లెట్ ఫీవర్ గా గుర్తించారు. ఇప్పుడు ఈ కేసులు బాగా ఎక్కువగా నమోదువుతున్నాయని చెబుతున్నారు డాక్టర్లు.

ముఖ్యంగా హైదరాబాద్ , చుట్టుపక్కల ప్రాంతాలలో ఈ కేసులు ఎక్కువగా రిపోర్టు అవుతున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం వచ్చే ఫీవర్ కేసులలో 25 నుంచి 30 శాతం స్కార్లెట్ ఫీవర్ కేసులు రిపోర్టు అవుతున్నాయని చెప్పారు గతంలో కేవలం ఒకటి, రెండు శాతం కేసులు వచ్చేవని, ఇప్పుడు ఆ సంఖ్య బాగా పెరిగిందని వివరించారు. ఫీవర్, లక్షణాలు: జ్వరాల్లో వైరల్, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటివి ఉన్నట్లే.. స్కార్లెట్ ఫీవర్ కూడా ఒక రకమైన జ్వరం.



ఇది స్ట్రెప్టోకోకస్ అనే బ్యాక్టీరియా కారణంగా వస్తుంది. ఈ బ్యాక్టీరియా సోకినప్పుడు ముందుగా గొంతులో మంట, చర్మము మీద దద్దుర్లతో మొదలవుతుంది. సాధారణ జ్వరం తరహాలోనే శరీర ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. 102, 103 డిగ్రీల జ్వరం వస్తుంది. ఈ జ్వరానికి సంబంధించిన లక్షణాలు కొంచెం భిన్నంగా ఉంటాయి. ''విపరీతమైన గొంతు నొప్పితో స్కార్లెట్ ఫీవర్ మొదలవుతుంది.'' అంతేకాకుండా నాలుకపై మంట రావడం , శరీరంపై దద్దుర్లు , గొంతులో ఎర్రటి పొక్కులు ,నాలుక రంగు స్ట్రాబెర్రీ రంగులోకి మారడం గొంతులో పగుళ్లు కూడా రావొచ్చు.నోరు, మెడ, చేతులు, కాళ్లపై ర్యాషెస్(చిన్నపాటి పొక్కులు)విపరీతమైన దురద, తలనొప్పి, వికారం కడుపు నొప్పి, జ్వరం, గొంతునొప్పి నాలుగైదు రోజులపాటు ఉంటుందని చెప్పారు. శరీరంపై దద్దుర్లు తగ్గడానికి మాత్రం ఏడు రోజులు పడుతుందని వివరించారు. ఏ వయసు పిల్లలకు ఎక్కువగా వస్తుంది..

స్కార్లెట్ ఫీవర్ బడి ఈడు పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల మధ్య ఉన్న పిల్లల్లో కనిపిస్తుంది. 2 నుంచి 5 ఏళ్ల పిల్లల్లో ఫీవర్ వచ్చేందుకు అవకాశాలు చాలా ఎక్కువ. 5 నుంచి 7 సంవత్సరాల వయసుకు అవకా?శాలు కాస్త తగ్గుతాయి. 7 నుంచి 10 సంవత్సరాల మధ్య ఇంకొంచెం తగ్గుతుంది.ఎందుకంటే వీరికి ఇమ్యూనిటీ కొంచం ఎక్కువగా ఉండడం వలన అసలు ఫీవర్ రాదని కాదుగానీ, వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ఈ మధ్య కాలంలో ఎక్కువగా పిల్లలో మమ్స్(దవడ బిళ్లలు లేదా గవద బిళ్లల వాపు) వంటివి ఎక్కువగా వ్యాపిస్తున్నాయి. ఇలాంటి వ్యాధులతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. అప్పుడు వేరొక ఇన్ఫెక్షన్లు సోకేందుకు వీలుంటుంది. దీని వల్ల స్కార్లెట్ ఫీవర్ కూడా వ్యాపిస్తుంది. ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది ఇది అంటు వ్యాధి. ముఖ్యంగా పిల్లల్లో సులువుగా వ్యాప్తి చెందుతుంది. పిల్లలు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ఒకరితో మరొకరు దగ్గరగా వచ్చి మాట్లాడుతున్నప్పుడు నీటి తుంపర్లు పడటం, ఒకరి వస్తువులు మరొకరు వాడడం వల్ల ఇది వ్యాప్తి చెందుతుంది.స్కార్లెట్ ఫీవర్‌కు సరైన సమయంలో చికిత్స చేస్తే వెంటనే తగ్గిపోతుందని అంటున్నారు.

ఆసుపత్రిలో చేరే అవసరం ఉండదు. పిల్లలు ఆహారం తీసుకోలేక నీరసపడిపోవడం, మందులు వేసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తే వ్యాధి ముదిరి నిమోనియాకు దారితీస్తే మినహా ఆసుపత్రిలో చేరే అవకాశాలు చాలా తక్కువ'' అని చెప్పారు .తగిన జాగ్రత్తలు తీసుకొని ఒకరినుండి ఒకరికి వ్యాపించకుండా చూసుకుంటే తొందరగా తగ్గిపోతుంది . మన చుట్టు పక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలి . %ిరిగ

# ఉప్పులేని ఆహారం, 10 నిమిషాల నడక..

## సంవత్సరంలో 23 కిలోలు తగ్గిన మహిళ!

బరువు తగ్గడానికి చికిత్స అవసరం లేదు . కానీ, నిబద్ధత, ఆసక్తి, విధేయత ఉంటే బరువు తగ్గడం కష్టం కాదు. ఇక్కడ ఒక మహిళ ప్రతిరోజూ కేవలం 10 నిమిషాలు నడవడం మరియు ఉప్పు లేని ఆహారం తినడం ద్వారా 1 సంవత్సరంలో 23 కిలోల బరువు తగ్గింది. ఇది మీకు ఎలా తెలుసు? బరువు తగ్గడం ఎలా అనే వివరాలు ఇక్కడ ఉన్నాయి. చాలా మందికి బరువు తగ్గడం పెద్ద విషయం కాదు. అయితే, కొంతమందికి ఇది అంత సులభం కాదు. కొంతమంది ఎంత ప్రయత్నించినా, శరీరంలావుకరిగించలేకపోయింది. ముఖ్యంగా థైరాయిడ్ మరియు పిసిఓడి వంటి ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్న వారికి బరువు తగ్గడం అంత తేలికైన పని కాదు. డైటింగ్ లేదా వర్కవుట్ లేకుండా కేవలం 1 సంవత్సరంలో 23 కిలోల బరువు తగ్గిన మహిళ కథ ఇక్కడ ఉంది. బరువు తగ్గాలనే ఆలోచన నా మనసులో లోతుగా ఉంది. అందుకే ఏడాదిలో 23 కిలోల బరువు తగ్గానని 30 ఏళ్ల అవంతిక శరణ్ చెప్పింది. ఏడాది క్రితం 90 కిలోల బరువున్న అవంతిక ఇప్పుడు 67 కిలోలకు పడిపోయింది. అవంతిక ఇప్పుడు మరింత యవ్వనంగా కనిపిస్తోంది. నా బరువు కారణంగా నాకు నమ్మకం తగ్గింది. బరువు తగ్గడం మరియు నా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం నాకు చాలా అవసరం, ఆమె పేర్కొంది. ''నేను ఎప్పుడూ ఆహార ప్రియురాలిని కాదు. అందుకే డైట్ పూర్తిగా మార్చుకున్నాక భరించడం కష్టంగా అనిపించలేదు. గ్లూటెన్ ఉన్న ఆహారాన్ని వీలైనంత వరకు తినడం మానుకోండి. సాధారణ పాలు తాగకుండా, బాదం పాలు తాగడం మొదలుపెట్టాను. చపాతీలు తినడం మానేశాను. నేను రెండు వారాలకు ఒకసారి మాత్రమే మల్టీగ్రెయిన్ బ్రెడ్ తినేవాడిని'' అని అవంతిక తన బరువు తగ్గించే ప్రయాణం గురించి చెప్పింది. ''వారానికి రెండు పూటలా ఉప్పు లేకుండా తినాలని నియమం పెట్టుకున్నాను. నేను థైరాయిడ్ రోగిని కాబట్టి నా శరీరంలో నీటి శాతం తక్కువగా ఉంటుంది. కాబట్టి, నేను వారానికి కనీసం 2 రోజులు రాత్రి భోజనంలో ఉప్పు తినకుండా ఉంటాను. నేను ఈ రోజు వరకు ఈ నియమానికి కట్టుబడి ఉన్నాను. ఇది నాకు చాలా లాభించింది,'' అని అతను చెప్పాడు. అవంతిక రోజూ 3.5 లీటర్ల నీటిని తీసుకుంటుంది. ఇంతకు ముందు నీళ్లు తాగడం కష్టంగా ఉండడంతో జీలకర్ర, మెంతికూర, సోంపు గింజలను ఉడకబెట్టి తయారు చేసిన 1 లీటర్ డిటాక్స్ వాటర్ తాగేవాడు. ఇప్పటికీ అదే పద్ధతిని కొనసాగిస్తున్నాడు. రోజుకు రెండుసార్లు గ్రీన్ టీ తాగాలి. మజ్జిగను రోజుకు ఒకసారి తీసుకుంటారు. రోజూ యోగా, ఏరోబిక్స్ చేసే అవంతిక భోజనం చేసిన తర్వాత 10 నిమిషాల పాటు నడవడం మర్చిపోదు. ఇది ఆమె బరువు తగ్గించే ప్రయాణంలో చాలా సహాయపడింది. మీరు సంపూర్ణంగా బరువు తగ్గాలనుకుంటే, 60% డైట్ మరియు 40% వర్కౌట్ నియమాన్ని అనుసరించండి అని అవంతిక చెప్పింది.



# పేటియం ఫాస్టాగ్‌ను వాడొద్దు..!

## ఎన్‌హెచ్‌ఎఐ సూచనలు

ప్రస్తుతం పేటియం ఫాస్టాగ్ ఉపయోగిస్తున్న వినియోగదారులు ఇతర విత్త సంస్థల వద్ద కొత్త ఫాస్టాగ్ తీసుకోవాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) సూచించింది. టోల్‌ప్లాజాల వద్ద రద్దీని నివారించేందుకు, ప్రయాణం సులభతరం చేసేందుకు మార్చి 15లోగా ఏదైనా బ్యాంకు నుంచి కొత్తగా ఫాస్టాగ్ తీసుకోవాలని బుధవారం తన అడ్వైజరీలో పేర్కొంది. రెగ్యూలేటరీ నిబంధనలు ఉల్లఘించడంతో పేటియం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్‌బిఐ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. శుక్రవారం నుంచి పేటియం ఫాస్టాగ్ వినియోగదారులు రీఛార్జ్ చేసేందుకు అవకాశం లేదని తెలిపింది. గడువు తర్వాత కూడా వినియోగదారులు టోల్ చెల్లించడానికి ఇప్పటికే ఉన్న బ్యాలెన్స్‌ను మాత్రం ఉపయోగించుకోవచ్చని స్పష్టం చేసింది.


### పేటియం షేర్లకు పలు ఎంఎఫ్‌ల గుడ్‌బై

పేటియం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేర్లను ఆరు మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు పూర్తిగా విక్రయించాయి. మరో ఆరు ఫండ్లు కంపెనీలో తమ వాటాలను భారీగా తగ్గించుకున్నాయి. మొత్తంగా గత నెలలో ఎంఎఫ్‌లు దాదాపు రూ.380 కోట్లు విలువ చేసే దాదాపు 91 లక్షల షేర్లను వదులుకున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ఆర్‌బిఐ ఆంక్షల తర్వాత పేటియం షేరు విలువ భారీగా పడిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి 18 మ్యూచువల్ ఫండ్ల దగ్గర రూ.1,426 కోట్లు విలువ చేసే పేటియం షేర్లు ఉన్నాయి. జనవరిలో 24 ఫండ్లు రూ.3,384 కోట్ల షేర్లను కలిగి ఉన్నాయి. బుధవారం పేటియం షేర్ 4.99 శాతం నష్టపోయి రూ.350.95 వద్ద ముగిసింది.




# రిలయన్స్ చేతికి పారామౌంట్ వాటా

: వయాకామ్18లో పారామౌంట్ గ్లోబల్‌కు ఉన్న 13 శాతం వాటాలను రిలయన్స్ ఇండిస్టీస్ కొనుగోలు చేయనుంది. ఇప్పటికే వాల్ట్ డిస్నీతో తమ మీడియా వ్యాపార కార్యకలాపాలను విలీనం చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. భారత టివి వ్యాపారంలో తమకున్న వాటాలను రిలయన్స్‌కు విక్రయించనున్నట్లు అమెరికాకు చెందిన పారామౌంట్ గ్లోబల్ తెలిపింది. దీనిపై ఇప్పటికే ఇరు సంస్థలు ఓ ఒప్పందానికి వచ్చాయి. దీనికి నియంత్రణా సంస్థల అనుమతులు లభించాల్సి ఉంది. వయాకామ్ 18 మీడియా ప్రయివేటు లిమిటెడ్‌లో పారామౌంట్ గ్లోబల్‌కున్న 13.1 శాతం వాటాలను రూ.4,286 కోట్లతో కొనుగోలు చేసేందుకు ఒప్పందం ఖరారు చేసుకున్నట్లు రిలయన్స్ ఇండిస్టీస్ వెల్లడించింది. దీంతో వయాకామ్‌లో రిలయన్స్ వాటా 70.49 శాతానికి పెరుగుతుంది.



# పోకో నుంచి ఎక్స్6 నియో

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ పోకో మార్కెట్లోకి పోకో ఎక్స్6 నియోను విడుదల చేసింది. 8జిబి ర్యామ్, 128 జిబి స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.17,999గా నిర్ణయించింది. మార్చి 18 నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో లభ్యమవుతుందని తెలిపింది. 108 ఎంపి ప్రైమరీ సెన్సార్, 2ఎంపి డెప్త్ కెమెరాలు సహా సెల్ఫీ కోసం 16 ఎంపి కెమెరాను ఇందులో అమర్చినట్లు పేర్కొంది.

# వచ్చే ఏడాది 7% వృద్ధి.. ఫిచ్ రేటింగ్స్ అంచనా

## ఫిచ్ రేటింగ్స్ అంచనా

వచ్చే ఆర్థిక సంవత్సరం 2024-25లో భారత వృద్ధి రేటు 7 శాతంగా ఉండొచ్చని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. దేశీయంగా పెరిగిన డిమాండ్, వ్యాపారం స్థిరంగా కొనసాగడమే ఇందుకు కారణమని పేర్కొంది. ప్రస్తుత 2023-24లో 7.8 శాతం పెరుగుదల ఉండొచ్చని అంచనా వేసింది. గడిచిన మూడు త్రైమాసికాలుగా దేశీయంగా 8 శాతం కంటే అధికంగా జిడిపి పెరుగుతోందని.. చివరి త్రైమాసికంలోనూ అదే స్థాయిలో ఉండొచ్చని ఫిచ్ పేర్కొంది.






# మార్చి 15న 'రవికుల రఘురామ'

పాజిటివ్ వైబ్ ప్రొడక్షన్ బ్యానర్ తెరకెక్కుతున్న లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్టైనర్ చిత్రం 'రవికుల రఘురామ'. సినిమా నిర్మాణం పట్ల ఎంతో నిబద్ధత ఉన్న శ్రీధర్ వర్మ సాగి నిర్మాణంలో.. ట్యాలెంటెడ్ డైరెక్టర్ చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. యువ హీరో గౌతమ్ సాగి, అందాల భామ దీప్శిక జంటగా నటిస్తున్నారు.

మంచి వినోదాన్ని అందించే చిత్రం కావాలని నిర్మాత, దర్శకుడు ఎంతో కష్టపడుతున్నారు. డైరెక్టర్ చంద్రశేఖర్ తన సృజనాత్మకత మొత్తం జోడించి ఈ కథకి ప్రాణం పోస్తున్నారు. అలాగే హీరో హీరోయిన్లు కూడా మంచి పెర్ఫామెన్స్ అందించారు. వీరందరితో పాటు ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా పనిచేస్తున్న సుకుమార్ పమ్మి అద్భుతమైన పాటలు అందించారు. తన సంగీతాన్ని ఈ చిత్రానికి ఒక సోల్ గా మార్చేస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన 'చందమామే' అనే బ్యూటిఫుల్ మెలోడీ సాంగ్ అలాగే "ప్రాణాలే" రెండు పాటలు బాగా పాపులర్ అయ్యాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి విడుదల చేశారు.

# 29 నుంచి "ఇన్స్ పెక్టర్ రిషి"




హీరో, విలన్, నెగిటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్...ఇలా పాత్ర ఏదైనా నటుడిగా మెప్పిస్తుంటారు నవీన్ చంద్ర. సినిమాలతో పాటు వెబ్ సిరీస్ ల్లోనూ ఆయన పేరు తెచ్చుకుంటున్నారు. తెలుగులో మంచి గుర్తింపు అందుకున్న నవీన్ చంద్ర..ఇటీవల జిగర్తాండ డబుల్ ఎక్స్ ఎల్ సినిమాతో తమిళ ప్రేక్షకులకూ బాగా దగ్గరయ్యారు. దీంతో నేరుగా ఆయన లీడ్ రోల్‌లో కోలీవుడ్‌లో సినిమాలు, వెబ్ సిరీస్‌లు రూపొందు తున్నాయి. ఈ క్రమంలో వస్తున్న ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ ఇన్స్ పెక్టర్ రిషి. అమోజాన్ తమిళ్ ఒరిజినల్స్ గా ఈ సిరీస్ ఈ నెల 29వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రాబోతోంది. హారర్ క్రైమ్ కథతో ఇన్ స్పెక్టర్ రిషి వెబ్ సిరీస్ ను రూపొందించారు డైరెక్టర్ నందిని జె.ఎస్. మేక్ బిలీవ్ ప్రొడక్షన్స్ పై సుఖ్ దేవ్ లాహిరి నిర్మించారు. ఎలాంటి క్లూ లేకుండా జరుగుతున్న హత్యలను ఇన్వెస్టిగేట్ చేసే పవర్ ఫుల్ పోలీస్ అధికారిగా నవీన్ చంద్ర ఈ వెబ్ సిరీస్ లో టైటిల్ రోల్ పోషిస్తున్నారు. అంతు చిక్కని ఈ హత్యల వెనుక ఎవరున్నారు అనేది సస్పెన్స్, హారర్ అంశాలతో ఆసక్తికరంగా ఇన్స్ పెక్టర్ రిషిలో తెరకెక్కించారు. ఈ వెబ్ సిరీస్ లో సునైన, కన్నా రవి, మాలిని జీవరత్నం, శ్రీకాంత్ దయాల్, కుమార్ వేల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## మానవత్వం చాటుకున్న యంగ్ ప్రొడ్యూసర్

బేబి మూవీతో గతేడాది బ్లాక్ బస్టర్ మూవీ దక్కించుకున్నారు యంగ్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్. ఇప్పుడాయన పలు క్రేజీ ప్రాజెక్ట్స్ నిర్మిస్తూ టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీ అవుతున్నారు. ప్రొడ్యూసర్ గా సినిమా మీద ప్యాషన్ తో పాటు హ్యుమానిటీ విషయంలో ఎస్ కేఎన్ ముందుంటున్నారు. ఇటీవల దర్శకుల సంఘం ఎన్నికల్లో సంఘ సభ్యుల సంక్షేమ కార్యక్రమాల కోసం 10 లక్షల రూపాయల డొనేట్ చేశారు ఎస్ కేఎన్. ఇప్పుడు రోడ్డు ప్రమాదానికి గురైన ఎన్టీఆర్ అభిమానికి అండగా నిలబడ్డారు. అతనిది పేద కుటుంబం కావడంతో ఎన్టీఆర్ ఫ్యాన్స్ సోషల్ మీడియా ద్వారా విరాళాల కోసం రిక్వెస్ట్ చేశారు. ఈ రిక్వెస్ట్ కు స్పందించిన ఎస్ కేఎన్ 50 వేల రూపాయలు తన వంతు సహాయంగా పంపించారు. ఎప్పుడూ వేదికల మీద సరదాగా పంచులతో, ప్రాసలతో మాట్లాడుతూ నవ్వించే ఎస్ కేఎన్ లో ఇలాంటి స్పందించే మనసు, మానవత్వం ఉండటం మరో కోణం అనుకోవచ్చు.



# 'అనన్య' అద్భుత విజయం

### సాధించాలని అభిలాష

జయరామన్, చందన, తోషి అలహరి, ప్రజ్ఞ గౌతమ్, అరవింద్, సుమన్ ముఖ్య తారాగణంగా ప్రసాద్ రాజు బొమ్మిడి దర్శకత్వంలో... శ్రీ సిద్ధి ధాత్రి మూవీ క్రియేషన్స్ పతాకం ప్రారంభ చిత్రంగా జంధ్యాల ఉమా నాగ శివ గంగాధర శర్మ నిర్మించిన విభిన్న కథా చిత్రం "అనన్య". హర్రర్ నేపథ్యంలో కుటుంబ ప్రేమ కథాచిత్రంగా రూపొందిన ఈ చిత్రం సెన్సార్ తో సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈనెల 22న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో "అనన్య" ప్రి రిలీజ్ వేడుకను హైద్రాబాద్ ఫిల్మ్ ఛాంబర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన ప్రముఖ నటుడు సుమన్, యువ కథానాయకుడు సందీప్ మాధవ్, నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రసన్న కుమార్, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, ప్రముఖ దర్శకనిర్మాత సాయి వెంకట్, విశ్రాంత న్యాయమూర్తి మాల్యాద్రి, శ్రీనివాస్ బోగిరెడ్డి, యువ దర్శకుడు అఫ్జల్ తోపాటు యూనిట్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "అనన్య" అద్భుత విజయం సాధించాలని ఈ సందర్భంగా అతిధులు అభిలషించారు. ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకున్న "అనన్య" అన్ని వర్గాల ప్రేక్షకులను కచ్చితంగా అలరించి తమ "శ్రీ సిద్ధి ధాత్రి మూవీ క్రియేషన్స్"కు శుభారంభాన్నిస్తుందని నిర్మాత జంధ్యాల ఉమా నాగ శివ గంగాధర శర్మ పేర్కొన్నారు.

# రష్మిక కన్నా త్రిప్తికి ఎక్కువ మార్కులు

యానిమల్ చిత్రం ఎంతటి విమర్శలు అందుకుందో.. అంతకుమించి బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.900 కోట్లకుపైగా కలెక్షన్లను రాబట్టి ఎన్నో రికార్డులు సృష్టించింది. ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతూ అక్కడ కూడా పలు రికార్డులు బద్దలుకొడుతోంది. గతేడాది డిసెంబర్ లో రిలీజైన ఈ సినిమా ఫస్ట్ షో నుంచి హిట్ టాక్ సాధించి.. తెలుగు రాష్ట్రాల్లో రూ.25 కోట్లకు పైగా వసూలు చేయడం విశేషం. ఈ మూవీలో బాలీవుడ్ స్టార్ నటుడు రణబీర్ కపూర్ హీరోగా



నటించగా.. ఆయనకు జోడీగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న యాక్ట్ చేసిన విషయం తెలిసిందే. అనిల్ కపూర్, బాబీ డియోల్, త్రిప్తి డిమ్రీ కీలక పాత్రల్లో నటించారు. అయితే ఈ సినిమాతో త్రిప్తి క్రేజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. హీరోయిన్ గా నటించిన రష్మిక కన్నా త్రిప్తినే ఎక్కువ మార్కులు కొట్టేసిందని చెప్పవచ్చు. మూవీలో జోయ పాత్రలో స్క్రీన్ పై త్రిప్తి కనిపించింది కొద్ది సమయమే. కానీ ఆమె యాక్టింగ్ తోపాటు లుక్స్ కు సినీ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. రణబీర్, త్రిప్తి మధ్య వచ్చే ఇంటిమేట్ సన్నివేశాలు ముఖ్యంగా హైలెట్ అయ్యాయి. వాటికి యూత్ బాగా కనెక్ట్ అయ్యారు.




# యమధీర టీజర్ లాంచ్

కన్నడ హీరో కోమల్ కుమార్ హీరోగా, ఇండియన్ క్రికెటర్ శ్రీశాంత్ నెగిటివ్ రోల్ ప్లే చేస్తూ మన ముందుకు రానున్న చిత్రం యమధీర. శ్రీమందిరం ప్రొడక్షన్స్ లో వేదాల శ్రీనివాస్ గారు తొలి చిత్రం గా వస్తున్న సినిమా యమధీర. ఈ సినిమాలో నాగబాబు గారు, ఆలీ గారు, సత్య ప్రకాష్ గారు, మధు సూధన్ గారు తదితరులు కీలకపాత్రలు పోషించారు. అయితే ఈ సినిమా టీజర్ ప్రముఖ నటులు %ఁ% ప్రొడ్యూసర్ అయినటువంటి అశోక్ కుమార్ గారు లాంచ్ చేయడం జరిగింది. ప్రొడ్యూసర్ వేదాల శ్రీనివాస్ గారు మాట్లాడుతూ...ఇది తన మొదటి చిత్రం అని, సినిమాల మీద ప్యాషన్ తో శ్రీమందిరం ప్రొడక్షన్స్ స్టార్ట్ చేశానని, ప్రేక్షకులు తమని ఆదరిస్తారని కోరుకుంటున్నాను అన్నారు. తన ఆహ్వానాన్ని మన్నించి వచ్చి యమధీర సినిమా టీజర్ లాంచ్ చేసిన తన స్నేహితుడు యాక్టర్, ప్రొడ్యూసర్ అయినటువంటి అశోక్ కుమార్ గారికి ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే యమధీర సినిమా థియేటర్లో రిలీజ్ కానుంది అని వేదాల శ్రీనివాస్ గారు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ గారు మాట్లాడుతూ... తన స్నేహితులు వేదాల శ్రీనివాస్ గారు కొత్తగా శ్రీమందిరం ప్రొడక్షన్స్ మొదలుపెట్టడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. శ్రీమందిరం ప్రొడక్షన్స్ లో తొలి చిత్రంగా వస్తున్న యమధీర చాలా బాగా ఆడాలని అలాగే మరెన్నో చిత్రాలు శ్రీ మందిరం ప్రొడక్షన్స్ లో రావాలని ఆయన అన్నారు. కన్నడలో 90కు పైగా సినిమాలలో నటించిన కోమల్ కుమార్ గారు ఈ సినిమా లో కథానాయకుడిగా నటించడం విశేషం అని అన్నారు. క్రికెటర్ శ్రీశాంత్ ఫాస్ట్ బౌలర్ గా మైదానం లో చూపే దూకుడు ని ప్రతినాయకుడిగా చూపించే అవకాశం ఉంది అన్నారు. అలాగే ఈ చిత్రం అజర్ బైజాన్, శ్రీలంక వంటి దేశాలతో పాటు మన దేశంలోని మైసూర్, చెన్నై, బెంగళూరు ఇతర ప్రాంతాలలో షూటింగ్ జరగడం విశేషం అని తెలిపారు.

# ఆకట్టుకునేలా 'కళింగరాజు' ఫస్ట్ లుక్

నాటకం సినిమాతో హీరోగా ఆశిష్ గాంధీ, దర్శకుడిగా కళ్యాణ్ జీ గోగణకు మంచి పేరు వచ్చిన సంగతి తెలిసిందే. మళ్లీ ఈ ఇద్దరూ కలిసి ఓ ప్రాజెక్ట్‌ను చేయడం విశేషం. ఆశిష్ గాంధీ, కళ్యాణ్ జీ గోగణ కాంబోలో రిజ్వాన్ ఎంటర్టైన్మెంట్స్, శ్రీ స్పెక్ట్రమ్ స్టూడియోస్, సుందరకాండ మోషన్ పిక్చర్స్, కళ్యాణ్ జీ కంటెంట్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రానికి 'కళింగరాజు' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. టైటిల్‌తో పాటుగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. కళ్యాణ్‌జీ గోగణ, ఆశిష్ గాంధీ కాంబోలో వస్తున్న 'కళింగరాజు' చిత్రాన్ని రిజ్వాన్, శ్రీ సాయి దీప్ చాట్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'కళింగరాజు' మూవీకి సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్‌ను బుధవారం నాడు లాంచ్ చేశారు. ఈ మేరకు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇందులో ఊరి వాతావరణం



కనిపిస్తోంది. ఇక ఆశిష్ గాంధీ కుర్చీ మీద కూర్చున్న తీరు, రక్తంతో తడిచిన ఆ కత్తి, రక్తపు మరకలతో కూడిన ఆ పాల క్యాన్ ఇదంతా చూస్తుంటే సినిమా అంతా రా అండ్ రస్టిక్‌గా ఉండేలా కనిపిస్తోంది. ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందిస్తున్నారు. 90s వెబ్ సిరీస్‌తో సురేష్ బొబ్బిలి ఈ మధ్య ఎంతగా ట్రెండ్ అయ్యారో అందరికీ తెలిసిందే.

# మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ రావు మృతి

### నివాళి అర్పించిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు




**హైదరాబాద్,మార్చి14(వెలుతురు):** ఉమ్మడి వరంగల్ జిల్లా చెన్నూరు మాజీ శాసనసభ్యులు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మాజీ చైర్మన్ డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్ రావు మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నివాళు లర్పించారు. హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో ఉన్న పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. గత కొన్నాళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం వద్దే కొత్తపల్లిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, ఎండోక్రైనాలజిస్ట్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్‌రావు స్వస్థలం మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని వద్దేకొత్తపల్లి. 1974 లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆయన 1984లో డీఎం పట్టా అందుకున్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఉద్యోగం ప్రారంభించి, గాంధీ మెడికల్ కాలేజీలో ఎండోక్రైనాలజీ విభాగం అధిపతిగా 1999లో రిటైర్ అయ్యారు. ఆ తర్వాత పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో వివిధ హోదాల్లో కొనసాగి వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 8 పరిశోధన పత్రాలను ప్రచురించారు. జాతీయ, అంతర్జాతీయ వైద్యుల సొసైటీల్లో సభ్యుడిగా ఉన్న ఆయనకు 2014లో ఎండోక్రైనాలజీ విభాగంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు, 2016లో డయాబెటిక్ విభాగంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు వరించాయి.

సుధాకర్‌రావు తండ్రి యతిరాజారావు ఉమ్మడి ఏపీలో ఏడుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. యతిరాజారావు మంత్రిగా కూడా పనిచేశారు. 1999 నుంచి 2003 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సుధాకర్ రావు అంచనాల కమిటీ సభ్యుడిగా, ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్‌గా వ్యవహరించారు. గత ఆగస్టు 14న ఆయనను ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్‌గా నాటి సీఎం కేసీఆర్ నియమించారు.

# సీఏఏపై చట్టపరంగా, రాజకీయంగా పోరాడుతాం

### సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం



**కేరళ,మార్చి14(వెలుతురు):** సీఏఏపై చట్టపరంగా, రాజకీయంగా పోరాడుతామని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియారాజ్యసభ ఎంపీ, సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం గురువారం అన్నారు. సీఏఏ అమలును సవాల్ చేస్తూ ఆయన గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీఏఏ నిబంధనలు రాజ్యాంగంలోని లౌకిక సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉన్నాయని, ఈ చట్టం అమలును నిలిపివేయాలని అభ్యర్థిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించామని ఆయన చెప్పారు. సీపీఐ మొదటి నుంచే సీఏఏను గట్టిగా వ్యతిరేకిస్తోందని బినోయ్ విశ్వం ఒక ప్రకటనలో తెలిపారు. "పౌరసత్వ సవరణ బిల్లు 2019పై పార్లమెంటులో చర్చ సందర్భంగా, దేశంలోని పౌరసత్వ చట్టాలకు ప్రతిపాదిత సవరణను తాను విమర్శించినట్లు, భారతదేశంలో ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా పరిగణించాలనే గురు గోల్వాల్కర్ ఫాసిస్ట్ ఆకాంక్షను నెరవేర్చడానికి ఈ బిల్లు ఉద్దేశించబడిందని ఆయన చెప్పారు. భారతదేశంలో లౌకికవాదం, సమానత్వానికి సీఏఏ మరణశిక్ష అని తాను అభివర్ణించానన్నారు. 2019లో సీఏఏకు వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకు ఇతర సీపీఐ కార్యకర్తలతో పాటుగా, 2019లో కర్ణాటకలోని అప్పటి-బీజేపీ ప్రభుత్వం మంగళూరులో నిర్బంధించిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.కేంద్ర ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం -2019 కోసం నిబంధనలను కేంద్రం నోటిఫై చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు అమలు చేస్తామని ప్రకటించింది. నాలుగేళ్ల క్రితం పార్లమెంట్‌లో హడావుడి చేసినా సీఏఏను నిద్రాణంగా ఉంచారని విశ్వం అన్నారు. ఎన్నికలకు ముందు రోజున ఈ అగాధ చట్టాన్ని అమలు చేయడం భారతదేశంలోని వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలు, చీలికలను ప్రేరేపించడానికి బీజేపీ విస్తృత ఎజెండాలో భాగమని ఆయన విమర్శించారు. విభజన, వివక్షత చట్టం రాజ్యాంగంలో పొందుపరచబడిన విలువలకు విరుద్ధమని, ప్రతి వర్గం నుండి వ్యతిరేకించబడిందన్నారు. సమాజంలో పౌరసత్వం ఇవ్వడానికి మతాన్ని నిర్ణయాత్మకంగా మార్చడం మన రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని ఆయన అన్నారు.

# ఎమ్మెల్యేగా పోటీకే పవన్ మొగ్గు

### పిఠాపురం నుంచి పోటీ చేయనున్న జనసేనాని

### ఆవిర్భావ దినోత్సవంలో స్వయంగా ప్రకటన



**మంగళగిరి,మార్చి14(వెలుతురు):** జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేసే స్థానంపై ఉత్కంఠ వీడింది. కాకినాడ జిల్లా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్టు పవన్ స్వయంగా వెల్లడించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ సభలో ఈమేరకు ప్రకటన చేశారు. తనకు ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఉందని, ప్రస్తుతానికి ఎంపీగా పోటీ చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. తెదేపా, భాజపాతో పొత్తులో భాగంగా జనసేనకు 21 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆయన బుధవారం రాత్రి మరో 9 మందికి పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. వారితో మాట్లాడి ఎన్నికల ప్రచారం చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పెందుర్తి నియోజకవర్గం నుంచి పంచకర్ల రమేశ్, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్, విశాఖ దక్షిణం నుంచి వంశీకృష్ణయాదవ్‌లను పిలిచి మాట్లాడి ప్రచారం చేసుకోవాలని చెప్పారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు నుంచి పత్సమట్ల ధర్మరాజు, నరసాపురం నుంచి బొమ్మిడి నాయకర్, భీమవరం నుంచి మంగళవారం పార్టీలో చేరిన పులపర్తి రామాంజనేయులు అభ్యర్థిత్వాలకు ఆమోదం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజోలు నుంచి దేవవరప్రసాద్ అభ్యర్థిత్వం ఖరారు చేశారు. తిరుపతి నుంచి ఆరణి శ్రీనివాసులుతో భేటీ అయ్యారు. ఈ స్థానం కూడా దాదాపు ఖరారైనట్లేనని చెబుతున్నారు. ఇప్పటికే పార్టీ తరఫున నిడదవోలు నియోజకవర్గం నుంచి కందుల దుర్గేష్, కాకినాడ గ్రామీణం నుంచి పంతం నానాజీ, నెల్లిమర్ల నుంచి లోకం మాధవి పోటీ చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# బిఆర్ఎస్,బిజెపి ఒక్కటే అంటే చెప్పుతో కొడతా

### ఎంపిగా గెలవకుంటే రాజకీయ సన్యాసం చేస్తా

### ఎన్నికల ప్రచారంలో బిజెపి అభ్యర్థి బూర



**యాదాద్రిభువనగిరి,మార్చి14(వెలుతురు):** బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు ఒక్కటే అన్న వారిని చెప్పుతో కొడతామని భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజకీయ లబ్ది కోసం ఇలాంటి వార్తలను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బిఆర్ఎస్‌ను ఆదరించాల్సిన పని బిజెపికి లేదన్నారు. గురువారం చౌటుప్పల్ మండలం ఆరెగూడెం, లింగోజి గూడెం గ్రామాల్లో బూర నర్సయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాకంటే ముందున్న ఎంపీలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లు భువనగిరి అభివృద్ధిపై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. భువనగిరిలో బీజేపీ గెలవకపోతే శాశ్వతంగా రాజకీయ సన్యాసం చేస్తానని అన్నారు. నీకు దమ్ము ధైర్యం ఉంటే నీ మంత్రి పదవికి రాజీనామా చేస్తావా కోమటిరెడ్డి వెంకటరెడ్డి అంటూ సవాల్ చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు వర్తమానంలో లేదు.. భవిష్యత్తులో కూడా ఉండదని అంటూ బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు. ఇలాంటి ప్రచారాలతో లబ్ది పొందడం దుర్లభమని అన్నారు. కాంగ్రెస్ ఎంత దూరమో, బిఆర్ఎస్ కూడా బిజెపికి అంతేదూరమని అన్నారు. ఆ పార్టీని ప్రజలే బొందపెట్టారని అన్నారు. అలాంటి పార్టీని తామెందుకు మోసతామని బూర అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు గతంలో లేదు భవిష్యత్తులో కూడా ఉండబోదన్నారు. కాళేశ్వరంపై హంగామా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం దమ్ముంటే బీఆర్ఎస్ నాయకుల పై కేసులు నమోదు చేయాలని సవాల్ చేశారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com